



పరేడ్ రిహార్సల్స్‌లో గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్‌పి కృష్ణకాంత్

యాప్ కష్టాలు

- ఉపాధ్యాయులపై పెరుగుతున్న భారం
- కొత్తగా ప్రశస్త యాప్

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

ప్రభుత్వ ఉపాధ్యాయు లపై రోజురోజుకు యాప్ ల భారం పెరిగిపోతోంది. ఇప్ప టికే బోధనేతర పనులతో సత మతమవుతుండగా దీనికి తోడు ప్రతిపనికీ ఒక యాప్ రూపొందించి అందులో వివరాలు నమోదు చేయాలని ఒత్తిడి తెస్తుండటం సమస్యగా మారింది. ఫలితంగా ఉపాధ్యాయులు పాఠాలు సరిగా చెప్పలేని పరిస్థితి నెలకొంది...

కర్నూలు జిల్లాలో 1,437, నంద్యాల జిల్లాలో 1,368 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వీటి పరిధిలో 4,09,288 మంది విద్యార్థులు చదువు తున్నారు. ప్రాథమిక పాఠశాలల్లో చాలాచోట్ల ఒకరిద్దరు ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారు. వీరు విద్యాలయాలకు వచ్చిన నాటి నుంచి ఉన్న ఐదు తరగతులను పంచుకుని పాఠాలు చెప్పాలి. కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో విద్యార్థుల చేరికలు, వారి వివరాలు ఆన్లైన్ చేయడం, జగనన్న విద్యా కానుక పంపిణీ, నాడు-నేడు పనులు చూసుకున్న తర్వాతే తరగతులు నిర్వహించాలి. చాలా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ఏకోపాధ్యాయులు పనిచేస్తున్నారు. ఉదయం 8.30 గంటలకు పాఠ శాల ప్రారంభమైతే ముందుగా మరుగుదొడ్ల చిత్రాలు తీయాలి.. ఆ తర్వాత విద్యార్థుల హాజరు నమోదు చేయాలి. బియ్యం, గుడ్లు, చిక్కీల చిత్రాలు, వివరాలు తీసుకోవడంతోపాటు వాటిని ఆన్లైన్లో అప్లోడ్ చేయాలి. ఆ తర్వాతే తాను బోధించే మూడు తరగతులకు సంబంధించిన వర్క్ పుస్తకాలు రాయించాలి. ఇప్పుడున్న యాప్లతోనే ఇబ్బందులు పడుతున్నామని ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. వీటికితోడు ప్రస్తుతం కొత్తగా ప్రశస్త పేరుతో యాప్ను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఇది ప్రత్యేక అవసరాల విద్యార్థులకు సంబంధించినది.

ఇందులో విద్యార్థి, వారి తల్లి దండ్రుల పేర్లు, పుట్టిన తేదీ, పాఠశాల ప్రవేశ సంఖ్య వివరాలు నమోదు చేసి పంపాల్సి ఉంటుంది. తర్వాత ఒక్కో విద్యార్థికి సంబంధించి 30కి పైగా ప్రశ్నలు ఉంటాయి. వాటిని పూర్తి చేయాలి. పాఠశాల పేరిట ఉన్న జీమె యిల్ ద్వారా అనుసంధానం చేసుకోవాలి. ఈ ప్రక్రియ తెలియక చాలామంది ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉంది. దీనికి తోడు వివిధ పనుల కారణంగా ఒత్తిడికి గుర వుతున్నారని ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పెరుగుతున్న భారం...

ఉపాధ్యాయుడు సగటున మూడు తరగ తులు బోధించడంతో పాటు వాటికి సంబంధిం చిన వర్క్ పుస్తకాలు పూర్తి చేయించాలి. 1, 2 తరగతులకు మూడేసి సబ్జెక్టులు, 3, 4, 5వ తర గతుల విద్యార్థికి నాలుగేసి సబ్జెక్టులు ఉంటాయి. ప్రతి సబ్జెక్టుకు సంబంధించి ఒక పాఠానికి వర్క్ బుక్ లో కనీసం 10 పేజీలు రాయించాల్సి ఉంటుంది. ఈ ప్రకారం ఒక విద్యార్థితో కనీసం 40 పేజీలు రాయించాల్సి ఉంటుంది. నెలలో రెండు అధ్యాయాలు ఉంటే 80 పేజీలు రాయించాలి. ఒక తరగతికి 20 మంది ఉంటే 800 పేజీలు దిద్దాల్సి ఉంటుంది. గతేడాది నుంచి టరల్ (టీచింగ్ ఎట్ రైట్ లెవల్) విధానాన్ని మళ్లీ తీసుకొచ్చారు. 3, 4, 5 తరగతుల విద్యా ర్థులకు తెలుగు, ఆంగ్లంలో గంట చొప్పున ఆ మెటీరియల్ పూర్తి చేయించాలి. ఇదికాక కొత్తగా టోఫెల్ అని పెట్టారు. ఇలా పలు బాధ్యతలతో ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు.

పరేడ్ రిహార్సల్స్‌ను పరిశీలించిన ఎస్‌పి కృష్ణకాంత్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

ఆగస్టు 15 (మంగళవారం)న జరగబోయే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా పోలీసుల పరేడ్ రిహార్సల్స్‌ను ఆదివారం జిల్లా పోలీసు కార్యాలయంలోని పరేడ్ మైదానంలో జిల్లా ఎస్‌పి జి.కృష్ణకాంత్ పరిశీలించారు. పోలీసుల నుండి జిల్లా ఎస్‌పి గౌరవ వందనం స్వీకరించారు. కవాతు పరిశీలన వాహనంపై నుండి పోలీసుల కవాతును పరిశీలించారు. అనంతరం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు విచ్చేయనున్న ప్రముఖులు, స్వాతంత్ర్య సమర యోధుల కుటుంబాలు, ఉన్నతాధికారులకు కల్పించాల్సిన భద్రత , మౌళిక వసతుల గురించి సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఎఆర్ అడిషనల్ ఎస్పీ నాగబాబు, ఎఆర్ డిఎస్‌పి ఇలియాజ్ బాషా, ఆర్ఐలు వియస్ రమణ, పోతురాజు, శివారెడ్డి, రవి కుమార్ , ఎస్ఐలు, ఆర్ ఎస్ఐలు , సివిల్ , ట్రాఫిక్ , ఎఆర్ , ఫైర్ పోలీసులు హోంగార్డ్స్ తో పాటు స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు ఈ రిహార్సల్స్ కవాతులో పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షన్‌లో మొదటి ర్యాంకే లక్ష్యం

- రోడ్లు, డ్రెయినేజీల సమస్యను పరిష్కరిస్తాం - నగరసుందరీకరణకు ప్రజల సహకారం అవసరం
- ప్రజాశక్తితో కర్నూలు మేయర్ బివై.రామయ్య



ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

'స్వచ్ఛ సర్వేక్షన్‌లో కర్నూలు నగరపాలక సంస్థకు మొదటిర్యాంకు తీసుకురావడమే ప్రధాన లక్ష్యం. మొదటి ర్యాంకు రావడం ద్వారా స్మార్ట్ సిటీ చేసేందుకు ప్రభుత్వాన్ని అడగవచ్చు. స్మార్ట్ సిటీ అయినప్పుడు నగరానికి భారీగా నిధులు వస్తాయి. నగరం అభివృద్ధి చెందుతుంది. రోడ్లు , డ్రెయినేజీ సమస్యను పరిష్కరిస్తాం. అందుకు ప్రజల సహకారం అవసరం ఇంటివద్దకు వచ్చే వాహనాలకు తడిపొడి చెత్తను వేరుచేసి ఇవ్వాలి. కాలువలు, డ్రెయినేజీలలో వ్యర్థాలను పారవేయకూడదు. నాటిన మొక్కలను సంరక్షించడానికి ప్రజల భాగస్వామ్యం అవసరం అప్పుడే నగరంలో గ్రీనరీ అభివృద్ధి చెంది కాలుష్య నివారణకు తోడ్పడుతుంది. తాగునీటి సమస్యల పరిష్కారానికి తగిన కృషి చేస్తున్నాం. కళాకారుల కోసం కొండారెడ్డి బురుజువద్ద నిర్మించే కాంప్లెక్స్ పై భాగంలో భవనాన్ని కేటాయించాలనుకున్నాం.' అని కర్నూలు నగరమేయర్ బివై.రామయ్య అన్నారు. ప్రజాశక్తి ముఖాముఖిలో ఆయన మాట్లాడారు.

కర్నూలు నగరాభివద్ధికి ఎన్ని కోట్ల నిధులు ఖర్చు చేశారు ?

మేయర్: కర్నూలు నగరంలోని 52 వార్డులలో అభివృద్ధి చేసేందుకు కౌన్సిల్లో తీర్మానం చేసి 500 కోట్లు ప్రతిపాదించాం. అందులో రూ.200 కోట్లు ఖర్చు చేశాం. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 125 కోట్లతో వాటర్ వర్క్స్‌లో కోడుమూరు నియోజకవర్గానికి నీటి సమస్య తీర్చేందుకు 15 ఎం ఎల్‌డి సామర్థ్యంతో రూ.15 కోట్లతో ఒక సంవత్సర కాలంలోనే నీటి శుద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేశాం.

నగరంలోని మురుగునీరు నదుల్లో కలవకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారు?

మేయర్: నగరంలోని మురుగునీరు నదుల్లో కలవకుండా దేవనగర్ వద్ద, జోరాపురం హంద్రీ వంతెన వద్ద రూ.ఆరు కోట్లతో ట్రీట్మెంట్ ప్లాంట్లను నిర్మిస్తున్నాం.

గతేడాదినాటిన 70 వేలలో ఎన్ని బతకాయి..?

మేయర్: కర్నూలు నగరంలో శివారు ప్రాంతాల్లో పార్కుల్లో గత సంవత్సరం 70 వేల మొక్కలు నాటాం. వాటి పరిరక్షణ బాధ్యత ప్రజలు తీసుకున్నప్పుడే అవి పెరిగి పెద్దగ అవుతాయి. ప్రజలకు కావలసిన ఆక్సిజన్ లభిస్తుంది. ప్రజల్లో మార్పు వచ్చి ఒక్కో మనిషి ఒక్క మొక్క నాటి సంరక్షించినప్పుడే లక్ష్యాన్ని చేరవచ్చు.

పార్కులు కబ్జాలు కాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారు?

మేయర్: కర్నూలు నగరంలోని పార్కు స్థలాలు కబ్జా కాకుండా చుట్టూ కంచెలు ఏర్పాటు చేసి పరిరక్షిస్తాం. అలాగే ఆయా కాలనీలో కాలనీ సంక్షేమ కమిటీలు ముందుకు వస్తే పార్కులను అభివృద్ధి చేసి వారికి అప్పజెబుతాం.

వర్షాకాలంలో వదర, మురుగునీరు రోడ్లపై, ఇండ్లలో చేరకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారు?

మేయర్: వర్షాకాలంలో మురుగునీరు రోడ్లపై ఇళ్లల్లో చేరకుండా ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా వేసవికాలంలోనే ప్రత్యేకంగా కార్మికులను నియమించుకొని కాలువలలో ఉన్న సిల్టు తొలగించాం. దోమల నివారణకు ఫాగింగ్ చేస్తున్నాం.

నగర ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేందుకు ఏం చేస్తున్నారు?

మేయర్: కర్నూలు నగర ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేందుకు గుత్తి పెట్రోల్ బంకు హైవే కింద ఖానా ఖజానా (ఈట్ స్ట్రీట్) ఏర్పాటు చేస్తు న్నాం. అలాగే కొండారెడ్డి బురుజు వద్ద కూడా పిల్లలు, పెద్దలు వచ్చి ఆహ్లాదంగా గడిపేందుకు కావలసిన ఏర్పాట్లను ఏర్పాటు చేస్తున్నాం.

కళాకారులు తమ కళలను ప్రదర్శించేందుకు కళాక్షేత్రం ఎక్కడ నిర్మిస్తున్నారు?

మేయర్: కర్నూలు నగరంలోని కళాకారులను ప్రోత్సహించే విధంగా వారి కళా నైపుణ్యాన్ని ప్రదర్శించేందుకు కొండారెడ్డి బురుజు వద్ద నిర్మిస్తున్న షాపింగ్ కాంప్లెక్స్ పైన ఒక పెద్ద హాలును ఏర్పాటు చేస్తున్నాం.

జగనన్న అర్బన్ హెల్త్ సెంటర్లు ఏర్పాటు చేశారు. అక్కడ వైద్యులు మందులు లేవు. దానిపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

మేయర్: కర్నూలు నగరంలో ప్రజల ఆరోగ్యం పరిరక్షణ కోసం జగనన్న అర్బన్ హెల్త్ సెంటర్లను 12 నగరపాలక సంస్థ ఏర్పాటు చేసింది. అందులో వైద్యులు మందులను ఏర్పాటు చేయాల్సిన బాధ్యత డిఎం అండ్ హెచ్ఒది. అందుకు వారికి గుర్తు చేస్తున్నాం.

కర్నూలును అందమైన నగరంగా తీర్చిదిద్దేందుకు ఏం చర్యలు తీసుకుంటున్నారు?

మేయర్: సుందరయ్య సర్కిల్, మౌర్య ఇన్, ప్రభుత్వ వైద్యశాల, విశ్వేశ్వరయ్య సర్కిల్, సి క్యాంప్, స్టేట్ బ్యాంక్ సర్కిల్, స్టేడియం సర్కిల్, ఐదు రోడ్ల కూడలి, తదితర ప్రాంతాల్లో ప్రధాన రహదారుల వెంట పల్లె వాతావరణాన్ని ప్రతిబింబించే విధంగా బొమ్మలను, మినీ కొండారెడ్డి బురుజు, కరోనా క్లాక్ టవర్‌ను ఏర్పాటు చేసాం. పాలకమండలి వచ్చిన తర్వాత స్వచ్ఛ సర్వేక్షన్‌లో కర్నూలు నగరం జాతీయ స్థాయిలో179వ ర్యాంకును 70వ ర్యాంకుకు, గత సంవత్సరం 70వ ర్యాంకు నుండి జాతీయస్థాయిలో 55వ ర్యాంకు, రాష్ట్రంలో రెండవ ర్యాంకుకు తీసుకువచ్చాం. ప్రజల్లో మార్పు తీసుకువచ్చి చెత్తను కాలువల్లో ఎక్కడపడితే అక్కడ పార వేయకుండా తడి పొడి చెత్తను వేరుచేసి ఇంటి వద్దకు వచ్చే పారిశుధ్య కార్మికులకు ఇచ్చినట్ల యితే నగరం సుందరంగా తయారవుతుంది.



20న జెవివి జిల్లా 34వ మహాసభ

- జయప్రదానికి హార్థిక, ఆర్థిక సహకారం అవసరం - జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ బడేసాహెబ్ విజ్ఞప్తి



మాట్లాడుతున్న జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి డాక్టర్ కె.బడేసాహెబ్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఈనెల 20న కర్నూలు నగరంలో జన విజ్ఞాన వేదిక నిర్వహించే కర్నూలు జిల్లా 34వ మహాసభలకు హార్థిక, ఆర్థిక సహకారాన్ని అందించి జయప్రదం చేయాలని జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి డాక్టర్ కె.బడేసాహెబ్ విజ్ఞప్తి చేశారు. ఆదివారం కార్మిక కర్షక భవన్‌లో జిల్లా మహాసభల సన్నాహకంగా జిల్లా కమిటీ సమావేశం డాక్టర్ కె. బడే సాహెబ్ అధ్యక్షతన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జన విజ్ఞాన వేదిక గత 34 సంవత్సరాలుగా జిల్లాలో అనేక కార్యక్రమాలను చేపడుతూ, జిల్లాలో విద్యార్థుల, మేధావులు, మన్ననలను పొందిన విద్య, వైజ్ఞానిక సంస్థ అని తెలిపారు. ప్రజలకోసం సైన్స్, ప్రగతి కోసం సైన్స్, స్వావలంబన కోసం సైన్స్ అనే నినాదాలుగా చేసుకొని ఉద్యమిస్తున్న సంస్థ జనవిజ్ఞానవేదిక అన్నారు. ప్రజలలో నెలకొన్న మూఢ విశ్వాసాలను పారదోలడానికి నిరంతరం శ్రమిస్తున్నదని చెప్పారు. జాతకాలు, రంగురాళ్లు , నల్ల దారాలు, తాయత్తు, చేతబడి లాంటి వందలాది అంధ విశ్వాసాలకు వ్యతిరేకంగా నిరంతరం ప్రజలను చైతన్యవంతం చేస్తున్నామన్నారు. మహిళలు , వికలాంగుల కోసం ప్రత్యక కార్యక్రమాలకు రూపకల్పనచేసిం దన్నారు. సేవ్ దిగర్ల్‌చైల్డ్, ఆడపిల్లను పుట్టనివ్వండి, ఎదగనివ్వండి, చదవనివ్వండి లాంటి నినాదాలతో జిల్లా వ్యాప్తంగా అనేక విద్యాసంస్థలలో ప్రచార కార్యక్రమాలను చేశామన్నారు. సావిత్రిబాయి పూలె జయంతి ఉత్సవాలను జరిపి స్త్రీ విద్య ప్రాముఖ్యతను వివరించామని తెలిపారు. ప్రజలు ఎక్కువగా ఎదుర్కుంటున్న ఆరోగ్యసమస్యలపై ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు ఇస్తున్నామని వివరించారు. కరోనా, డెంగ్యూ, మలేరియా లాంటి జబ్బులపై ప్రజలను అప్రమత్తం చేయడమేగాక, వారికి సహాయ, సహకారాలను అందించిందన్నారు. విద్యార్థులు కూల్ డ్రింక్స్ తాగడం ద్వారా వచ్చే నష్టాలను, ఆరోగ్య సమస్యలను వివరించి చెబుతున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తముగా వందలాది విద్యాసంస్థలలో కూల్ డ్రింక్స్ మానండి అని పెద్దఎత్తున ప్రచారం చేసిందన్నారు. ప్రజలలో సామాజిక భాధ్యతలను, సామిజిక స్పృహ కలిగించేందుకు గురుజాడ, శ్రీ శ్రీ, జాషువా లాంటి గొప్ప సాహితీవేత్తల జన్మదినాలను, వారి రచనలను ప్రజలలో ప్రచారం చేశామని చెప్పారు. గురుజాడ దేశభక్తి గీతం "దేశమంటే మట్టికాదోయ్ దేశమంటే మనుషులోయ్" అనే గీతాన్ని విస్తృ ప్రచారం చేసిందన్నారు. జెవివి జిల్లా మహాసభలను ఈనెల 20న కర్నూలు సూర్యనారాయణ భవన్‌లో ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నామని చెప్పారు. మహాసభల విజయవంతానికి ప్రజల సహాయ సహకారాలు ఎంతో అవసరమని అన్నారు. ఈ సమావేశంలో సమతా మహిళా కన్వీనర్ రమాదేవి, జెవివి రాష్ట్ర కమిటీ సభ్యులు ఖాజా హుస్సేన్, జిల్లా కమిటీ సభ్యులు జంధ్యాల రఘుబాబు, సురేష్ కుమార్ ,తిమ్మప్ప, ధనుంజయ ,రమేష్, కల్లూరు మండల కార్యదర్శి ఆజాద్‌లు పాల్గొన్నారు.



మృతిచెందిన కార్మికుని భౌతిక కాయం వద్ద నివాళ్లు అర్పిస్తున్న సిఐటియునాయకులు

కార్మికుని కుటుంబానికి రూ.10 లక్షలు ఇవ్వాలి

ప్రజాశక్తి -కర్నూలు కార్పొరేషన్

కర్నూలులో లారీఆక్సిడెంట్‌లో మరణించిన బిర్లాగడ్డకు చెందిన సెంట్రింగ్ కార్మికుడు బి.పెద్దమద్దిలేటి కుటుంబానికి రూ.10 లక్షల ఆర్థిక సహాయం అందించి ప్రభుత్వం ఆదుకోవాలి సిఐటియు డిమాండ్ చేసింది. సెంట్రింగ్ కార్మికుడు బి.పెద్ద మద్దిలేటి శనివారం రాత్రి ప్రమాదవశాత్తు లారీ ఆక్సిడెంట్లో మరణించాడు. భవన నిర్మాణ కార్మిక సంఘం న్యూ సిటీ కార్యదర్శి ఆర్.నరసింహులు, అధ్యక్షులు కె.సుధాకరప్ప బిర్లాగడ్డకు ఆదివారం చేరుకొని బి.పెద్దమద్దిలేటి మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబాన్ని ఓదార్చి సానుభూతి తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ బిర్లాగడ్డ కాలనీకి చెందిన బి.పెద్దమద్దిలేటి సెంట్రింగ్ పని చేసుకుని కుటుంబాన్ని పోషించుకునేవాడన్నారు. ఆయన భార్య లక్ష్మీదేవి, ముగ్గురు కుమారులు ఉన్నారని తెలిపారు. శనివారం రాత్రి బంధువుల ఇంటికివెళ్లాలని స్కూటీపై పెద్దపాడు దాటి నాగులాపుం వైపు వెళుతుండగా ప్రమాదవశాత్తు లారీకింద పడి మరిణించారని వివరించారు. ఆయన ముగ్గురు పిల్లలకు చదువు చెప్పించే బాధ్యత ప్రభుత్వం తీసుకొని,వారికుటుంబానికి రూ.10 లక్షల ఆర్థికసహాయం అందించాలని డిమాండ్ చేశారు. చనిపోయిన కార్మికుని కుటుంబానికి న్యాయం చేయకపోతే కార్మికులను సమీకరించి పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

డాక్టర్ మద్దిలేటికి కాకతీయ వైభవ కీర్తి పురస్కారం

ప్రజాశక్తి - కర్నూలు కల్చరల్

సాహితీవేత్త , విశ్వవాణి తెలుగు సాహిత్య శిక్షణాసంస్థ ,విశ్వవాణి పబ్లికేషన్స్ అధినేత డాక్టర్ ఎన్‌కె.మద్దిలేటి కాకతీయ వైభవ కీర్తి పురస్కారం అందుకున్నారు. మాతృభాషా సంస్కృతి - సాంప్రదాయాల పరిరక్షణలో భాగంగా భాషా, సాహిత్య, సామాజిక, కళా, విద్యా, వైద్య రంగాలలో చేస్తున్న సేవలను గుర్తించి జాతీయ స్థాయిలో అందిస్తున్న జ్ఞాపిక, ప్రశంసాపత్రం రాజ కుటుంబీకులు ,ప్రాచీన కవుల వారసులచే జ్ఞాపిక, కంకణ, మకుట, ముత్యాలహార ధారణను వరంగల్‌లో అందుకున్నారు.

కాకతీయ వైభవ కీర్తి పురస్కారం అందుకుంటున్న మద్దిలేటి



పేదల ఆర్థికాభివృద్ధి కోసమే సంక్షేమం : హాఫీజ్‌ఖాన్



ప్రజాశక్తి- కర్నూలు క్రైమ్

పేదల ఆర్థికాభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని ఎమ్మెల్యే ఎంఎ.హాఫీజ్ ఖాన్ అన్నారు. స్థానిక 45వ వార్డులో మున్సిపల్, సచివాలయ సిబ్బంది, స్థానిక వార్డు నాయకులతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. లేబర్ కాలనీలో ఉన్న ప్రతి ఇంటింటికి వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ మాట్లాడుతూ ఆర్థికాభివృద్ధితోనే పేదల బతుకులు మారుతాయని చెప్పారు. ఈ ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రతి ఇంటికి మేలు చేసేలా పథకాలు తీసుకొచ్చి పారదర్శకంగా అమలు చేస్తున్నట్లు చెప్పారు.ఈ కార్యక్రమంలో 45వ వార్డ్ వైసిపి నాయకులు ప్రభుదాస్, జమ్మన్న, భాస్కర్ రెడ్డి, సితార ఇర్ఫాన్, షైక్, సాదిక్, జోషిరాజ్, చందు, ఖాదర్‌బాషా, జనార్దన్ రెడ్డి రామకృష్ణ, చాంద్ బాషా, పార్టీ ముఖ్యనాయకులు, వార్డు కన్వీనర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సిఐకి ఘనంగా సన్మానం

ప్రజాశక్తి-తుగ్గలి : పత్తికొండ రూరల్ సీఐగా పనిచేసిన రామకృష్ణారెడ్డి అనంతపురం జిల్లాకు బదలి కోవడంతో ఆదివారం రాత్రి తుగ్గలి పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐలు, పోలీసు సిబ్బంది ఆయ నను పూల మాలలతో, శాలువలతో ఘనంగా సన్మానించారు. తుగ్గలి, జొన్నగిరి ఎస్ఐలు మల్లి కార్జున, రామాంజనేయులు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సర్వ సాధారణమే నన్నారు. అక్కడ ఉన్నంతకాలం అందరి మన్న నలను పొందాలన్నారు. పోలీసు ఉద్యోగం అంటేనే కత్తి మీద సాము లాంటిది అన్నారు. సిఐ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ పత్తికొండ రూరల్ సర్కిల్‌పరిధిలోతననుప్రజలు ఆదరించారన్నారు.

ఐలు రాష్ట్ర కోశాధికారిగా కెంగారకుమార్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్



ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) 12వ రాష్ట్ర మహాసభలు ఈనెల 12, 13 తేదీలలో గుంటూరులోని శుభం కన్వెన్షన్ సెంటర్ జరిగాయి. కర్నూలు జిల్లా ఐలు నాయకులు కెంగార కుమార్‌ను రాష్ట్ర కోశాధికారిగా ఎన్నుకున్నారు. కర్నూలు నుండి రాష్ట్ర కార్యవర్గంలోకి డి. వెంకటస్వామి, రాష్ట్ర కమిటీలోకి జిల్లా నుండి ఎనిమిది మంది న్యాయవాదులను ఎన్నుకున్నారు. ఇందులో కె.కుమార్, డి.వెంకటస్వామి, ఎస్.లక్ష్మన్న. వి.రవి కుమార్, వెంకట అరుణ, నంద్యాల నుండి శ్రీనివాసమూర్తి, పత్తికొండ నుండి కాశీ విశ్వనాథ్, ఎమ్మిగనూరు నుండి తిమ్మప్పలను రాష్ట్ర కమిటీ లోకి తీసుకున్నారు.



ఐఆర్‌ఎపి రాష్ట్ర సదస్సులో కార్మికుల స్థితిగతులను వివరిస్తున్న ఎంఎ.గపూర్

కార్మికులకు తీరని అన్యాయం

రాష్ట్ర విభజన తరువాత హక్కులను హరించిన పాలకులు -ఐఆర్‌ఎపి రాష్ట్ర సదస్సులో వక్తలు

ప్రజాశక్తి-ప్రత్యేక ప్రతినిధి కర్నూలు

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సంఘటిత, అసంఘటిరంగ కార్మికులకు, చేనేత కార్మికులకు, సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాలలో ఎస్‌సి ఎస్‌టిలకు తీవ్ర అన్యాయం జరిగిందని, వారికి రాజకీయంగా సంక్రమించిన హక్కులను కూడా హరించి వేసే పద్ధతలను పాలకులు అనుసరిస్తున్నారని నిపుణులైన వక్తలు అభిప్రాయ పడ్డారు. ఆదివారం కర్నూలు బిర్లా కాంపౌండ్ లోని బ్రహ్మారెడ్డి హాస్పిటల్ సెమినార్ హాల్లో ఉమ్మడి రాష్ట్ర విభజన జరిగి పది సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఐఆర్‌ఎపి(ఇనిస్టిట్యూట్ పర్ రీసెర్చ్ ఆన్ ఆంధ్రప్రదేశ్) ఆధ్వర్యంలో శని, ఆదివారాల్లో రెండు రోజుల రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహించారు. రెండో రోజు రాష్ట్ర అధ్యయన వేదిక నుంచి మోహన్‌రావు అధ్యక్షతన మొదటి సెషన్‌లో ఆంధ్రప్రదేశ్‌లో కులం-రాజకీయం అంశంపై దళిత ఉద్యమ నాయకులు కొరివి వినయకుమార్, కోనసీమా లేక కులాలసీమ అంశంపై డాక్టర్ సతీష్ చెన్నూరు, సంక్షేమం -రాజకీయాలు, నగదు బదిలీ పథకాల అంశంపై ఎపి అధ్యయన వేదిక గోపాలరావు మాట్లాడారు. రెండో షెషన్‌లో శ్రీపాద్ మోతిరాం అధ్యక్షతన రాజధాని నగరం, నగరాలు-విమర్శనాత్మక పరిశీలన హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ రామచంద్రయ్య, ప్రొఫెసర్ పురేంద్రప్రసాద్, చిన్నపట్టణాలు, నేత కార్మికుల అభివృద్ధి అంశంపై రాష్ట్ర చేనేత జనసమాఖ్య నుంచి మోహన్‌రావు, విభజన అనంతరం ఎపిలో కార్మికుల స్థితిగతులు మాజీ ఎమ్మెల్యే , సిఐటియు జాతీయ నాయకులు ఎంఎ. గఫూర్ ప్రసంగించారు. ఆరోగ్య సంరక్షణ ప్రయివేటీకరణ గురించి జెవివి నాయకులు నెల్లూరు ప్రభుత్వ వైద్యశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ , జనరల్ సర్జన్ డాక్టర్ ఎస్‌కె.కలేషా సాహెబ్ మాట్లాడారు.

నానాటికి దిగజారుతున్న కార్మికులు పరిస్థితులు : ఎంఎ.గఫూర్

రాష్ట్ర విభజన తరువాత టిడిపి, వైసిపి ప్రభుత్వాలు సరళీకరణ ఆర్థిక విధానాలకు సంపూర్ణంగా అమలు జరిపినందున కార్మికులు స్థితిగతులు నానాటికి దిగజారుతున్నాయని సిఐటియు జాతీయ నాయకులు ఎంఎ.గఫూర్ తెలిపారు. ఎపిలో సుమారుగా కోటి రూ.20 లక్షల మంది కార్మికులు ఉండగా అందులో 90శాతం అసంఘటిత కార్మికులు వివిధ వృత్తుల్లో విభజించబడి ఉన్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను కుదించి నాలుగు లేబర్‌కోడ్‌ల ద్వారా కార్మికుల హక్కులను బలహీన పరిచిందన్నారు. రాష్ట్రంలో కార్మిక శాఖనునిర్వీర్యం చేశారన్నారు. పనిగంటలు, ఉద్యోగభద్రత, అక్రమ తొలగింపులపై చర్యలు, బోనసు, గ్రాడ్యుటీ తదితర చట్టాలను అమలు చేసే పర్యవేక్షణ మెకానిజం దాదాపుగా లేకుండా పోయిందన్నారు. ఈజ్‌ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో అవార్డులు పొందడాన్ని గొప్పగా భావిస్తూ కార్పొరేట్ల అనుకూల ప్రభుత్వాలుగా ముద్రవేసుకోవడానికి రాష్ట్రంలో రెండు ప్రధాన పార్టీలు పోటీ పడుతున్నాయన్నారు. దీని వలన కార్మికుల సమస్యలపై ఎవ్వరికీ శ్రద్ధలేకుండా పోయిందన్నారు. కార్మిక ఉద్యమాలను అణచి వేసే స్వభావం పాలకుల్లో పెరిగిందన్నారు. కార్మికులకు వేతనాలు పెరిగితే కొత్తపెట్టుబడి దారులు రాష్ట్రానికి రారనే దురుద్దేశంతో వేతనాలు పెంచడం లేదన్నారు. వేతనాలు పెరిగితే ఉత్పత్తివ్యయం పెరుగుతుందనే సాకుతో కనీస వేతనాలు సవరించడం లేదని తెలిపారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగు ఉద్యోగ, కార్మికులతో వెట్టిచాకిరి చేయిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పరిశ్రమలలో పర్యవేక్షణ అధికారులను కుదించడం, కనీస రక్షణ చర్యలు తీసుకోకపోవడం వలన పరిశ్రమల్లో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. చనిపోయిన కార్మికులకు కూడా న్యాయమైన నష్టపరిమారం అందటం లేదన్నారు. అసంఘటిత రంగ కార్మికుల బతుకులు మరింత దుర్భరంగా ఉన్నాయన్నారు.

సగటు మనిషికి సరైన వైద్యం అందడం లేదు: డాక్టర్ ఎస్‌కె.కలేషా సాహెబ్

డాక్టర్ ఎస్‌కె.కలేషా సాహెబ్ మాట్లాడుతూ ప్రభుత్వాలు ప్రజల ఆరోగ్య రక్షణ పేరుతో ఆరోగ్య శ్రీ తదితర కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలు ప్రవేశపెట్టినా సామాన్యునికి సరైన వైద్యం అందడం లేదన్నారు. మనరాష్ట్రంలో సగటున మనిషి తన ఆదాయంలో 68 శాతం ఆరోగ్యానికి ఖర్చు చేస్తున్నారన్నారు. దేశంలో ఇతర రాష్ట్రాల్లో 48 శాతం ఖర్చు చేస్తున్నారన్నారు. ఉద్యోగ కార్మికుల వేతనాలు పెరగకుండా ఆరోగ్య రక్షణ ఎలా సాధ్యమవుతుందన్నారు. పౌష్టికాహారం , పరిసరాల పరిశుభ్రత తదితర రోగనిరోధకశక్తిని పెంచే అవగాహన, నివారణ చర్యలతోనే 80 శాతం జబ్బులను నివారించవచ్చన్నారు. కేవలం 20 శాతం మాత్రమే మనిషి శరీర ధర్మాన్ని బట్టి జబ్బులు వచ్చే అవకాశం ఉందన్నారు.రాష్ట్ర మెత్తం బడ్జెట్‌లో ఆరోగ్యానికి 0.9శాతం మాత్రమే నిధులు కేటాయిస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఐదు ప్రభుత్వ మెడికల్ కళాశాలలు పెరిగినా ప్రయివేటు విధానంలో నడుస్తున్నాయని తెలిపారు. నిధుల లేమితో ప్రతీది ప్రభుత్వ, ప్రయివేటు పార్టునర్‌షిప్(పిపిపి) పేరుతో నిర్వహిస్తున్నారన్నారు. దీని వలన ప్రయోజనం లేదన్నారు.

వార్డు మెంబర్‌గా సిపిఎం అభ్యర్థి ఏకగ్రీవం

ప్రజాశక్తి-ఆదోనిరూరల్



తుంబలం వెంకటేశ్వర్లును అభినందిస్తున్న నాయకులు

మండలంలోని పాండవగల్ గ్రామంలో 2వ వార్డు మెంబర్‌గా నామినేషన్ వేసిన సిపిఎం బలపరిచిన అభ్యర్థి తుంబలం వెంకటేశ్వర్లు ఏకగ్రీవం ఎన్నికయ్యాడు. గత 2021 ఎన్నికల్లో సిపిఎం అభ్యర్థిగా 2వ వార్డుకు పోటీచేసి తుంబలం మూకయ్య గెలుపొందారు. 2022 నవంబర్లో ఆయన అనారోగ్యంతో మరణించాడు. ఈ నేపథ్యంలో సిపిఎం తరపున తుంబలం ముకయ్య రెండవ కుమారుడు తుంబలం వెంకటేశ్వర్లు నామి నేషన్ దాఖలు చేశారు. వారి తండ్రి మరణాంతరం జరుగుతున్న ఎన్నికలు కావడంతో వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు అభ్యర్థులను నిలబెట్టకుండా తుంబలం వెంకటేశ్వర్లకు మద్దతు ఇస్తామని చెప్పడంతో వార్డు మెంబర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వార్డు మెంబర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన అభ్యర్థి తుంబలం వెంకటేశ్వర్లును సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కే.వెంకటేశ్వర్లు, సిపిఎం మండల నాయకులు రామాంజనేయులు, శాఖ కార్యదర్శులు పాండురంగ, అనిఫ్, గోవిందు వార్డు సభ్యులు కృష్ణ, స్థానిక కార్యకర్తలు హుసేని, మల్లి అభినందించారు. అనంతరం వారు మాట్లా డుతూ రెండో వార్డును ఏకగ్రీవంగా ఎన్నుకోవడానికి సహకరించిన వైసిపి, టిడిపి, జనసేన పార్టీల నాయకులకు, పాండవగల్ గ్రామ 2వ వార్డు ఓటర్లకు, ప్రజలకు సిపిఎం పార్టీ తరపున ధన్యవాదాలు తెలియజేశారు.


చట్టసభల్లో బిసిలకు అవకాశం ఇవ్వాలి : రమేష్ యాదవ్

ప్రజాశక్తి - ఆదోని




జనాభా ప్రాతిపదికన ఎంపీ ఎమ్మెల్యే స్థానాలు బీసీ, మైనార్టీలకు కేటాయించి చట్ట సభల్లో ప్రాతినిధ్యం వహించేలా రాజకీయ పార్టీలు చొరవ చూపాలని యాదవ హక్కుల పోరాట సమితి రాష్ట్ర సహాయ కార్యదర్శి, కర్నూలు జిల్లా బీసీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు, వంశీ చైతన్య నర్సింగ్ హెూమ్ మేనేజింగ్ డైరెక్టర్ రమేష్ యాదవ్ కోరారు. ఆదివారం మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీల ఓటర్లు అధికంగా ఉన్నారని, వారి ఓటుతోనే గద్దెనెక్కిన పాలకులు రాజకీయంగా అవకాశం కల్పించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. చిన్నచిన్న నామినేటెడ్ పోస్టులు ఇచ్చిన స్వేచ్ఛ ఇవ్వకుండా అధికారాన్ని వారి కబంధ హస్తాల్లోనే ఉంచుకుంటూ అనగాదొక్కుతున్నారన్నారు. బడుగు బలహీన వర్గాలకు రాజకీయ చైతన్యం కల్పించే దిశగా తమ సంఘం రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తుందన్నారు. బీసీల్లో చైతన్యం వచ్చినప్పటికీ ప్రశ్నించే తత్వం కోల్పోయారన్నారు. ఇప్పటికైనా ఐక్యమై రాజ్యాంగం కల్పించిన హక్కుల కోసం గళం విప్పాల్సిన అవసరం ఉందని ఆయన విజ్ఞప్తి చేశారు. ఓట్లు మావి సీట్లు మీవా అన్న నినాదం ప్రజల్లోకి తీసుకెళ్తామని తమ డిమాండ్ ను రాజకీయ పార్టీలు పరిగణలోకి తీసుకోవాలని కోరారు.


పట్టాదారు పాసు పుస్తకాలు రాక..
రుణాలు అందక..



- తప్పులు తడకతో రైతన్నలకు తప్పని తిప్పలు
- నెలలు తరబడిన రాని కొత్త పాసు పుస్తకాలు
- బ్యాంకు రుణాలు రాక.. వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్న కర్షకులు

ప్రజాశక్తి - ఆదోని రూరల్





రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా సమగ్ర భూ సర్వే చేపట్టింది. సమగ్ర సర్వేతో రైతుల సమస్యలు తీరుతాయని ప్రభుత్వ పెద్దలు పేర్కొం టున్నారు. ప్రభుత్వం నిర్ణయం మంచిది అయినప్పటికీ అధికారుల తప్పుడు సమా చారాన్ని నమోదు చేయడం, తదితర సాంకేతిక కారణాలు రైతుల పాలిట శాపంగా మారింది సమగ్ర భూ సర్వే. ఇటీవల ఆదోని, తదితర మండలాల్లో సమగ్ర సర్వే నిర్వహించగా అనేక మంది రైతుల పేరు, సర్వే నెంబర్, తదితర వివరాలు తప్పుగా నమోదుతో పాసు పుస్తకాలు రైతులకు వచ్చాయి. దీంతో వేల రూపాయలు ఖర్చు చేసుకొని రిజిస్టర్ చేయించుకొని, పట్టాదార పాస్ పుస్తకం అప్లై చేయగా నెలల తరబడి ఆలస్యం కావడంతో బ్యాంకులో రుణాలు అందక, అప్పులు తప్పడం లేదని రైతుల ఆవేదన చెందుతున్నారు. పంట దిగుబడులకు తీసుకొచ్చిన అప్పులకు వడ్డీలు కట్టలేకపోతున్నామని రైతులు తెలిపారు. పైగా రీసర్వే నిర్వహించిన, జరుగుతున్న గ్రామాల్లో మ్యుటేషన్ల ప్రక్రియ సజావుగా జరగడం లేదన్న వాదన విన్పిస్తోంది. రీసర్వే పూర్తయిన గ్రామాల్లో 'జగనన్న భూహక్కు పత్రం' పేరుతో పట్టాదారు పాసుపుస్తకం, భూయాజమాన్య హక్కు పత్రం కలిపి ఒకటే పుస్తకంగా ముద్రించి పంపిణీ చేస్తున్నారు. తాజా వివరాలతో వీటిని మంజూరు చేస్తున్న నేపథ్యంలో ఇకపై ఈ-పాసు పుస్తకాలు రావడం అనుమానమేనన్న ప్రచారం రెవెన్యూ వర్గాల్లో వ్యక్తమవుతోంది.

రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో వివరాలు నిర్ధారించుకుని, మ్యుటేషన్ ప్రక్రియ పూర్తి చేసిన తర్వాత ఆ వివరాలు నేరుగా ముద్రణ సంస్థకు వెళ్లేలా ఆన్‌లైన్ ప్రక్రియ అమలు చేస్తున్నారు. ఆన్‌లైన్‌లో నమోదైన 15 రోజులకు ఈ-పాసు పుస్తకం పోస్టు ద్వారా రైతు ఇంటికి వచ్చేలా ఏర్పాట్లు చేశారు. కొన్ని రోజులు అటు, ఇటు అయినా మొదట్లో ఈ ప్రక్రియ బాగానే అమలైంది. కానీ గత కొంతకాలం నుంచి నెలలు గడచినా పాసు పుస్తకాలు చేతికి రావడం లేదు. ఇది ఒక్క ఆదోని మండలంలోనే కాదు జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొంది. రైతులకు పట్టాదారు పుస్తకాలు జారీ చేసే విధానంలో మార్పులు చేసి, అక్రమాలకు తావులేనివిధంగా ఈ-పాసు పుస్తకాల జారీ చేపట్టామని ప్రభుత్వం చెబుతున్నా వీటి మంజూరులో ఎడతెగని జాప్యం నెలకొంది.

కర్నూలు జిల్లా ఆదోని మండలం, పెద్దహరివాణం గ్రామానికి చెందిన రైతు శివన్నకు ఇద్దరు సంతానం. అన్నదమ్ములు విడిపోవడంతో తనకున్న భూమిని ఇద్దరు పేర్ల మీద కుమారులకు చేయించారు. రంగస్వామి అనే రైతు నాలుగు నెలల కిందట ఈ-పాసు పుస్తకం కోసం దరఖాస్తు చేసుకున్నాడు. కానీ ఇప్పటి వరకు చేతికందలేదు. ఎప్పుడొస్తుందనే ప్రశ్నకు రెవెన్యూ సిబ్బంది దగ్గర సమాధానం లేదు. చెన్నై నుంచి నేరుగా పోస్టులో వస్తుందని మాత్రమే చెప్పారు.

మరో పెద్దతుంబలం గ్రామానికి చెందిన రైతుకు గతంలో ఈ-పాసు పుస్తకం వచ్చినా, అందులో వివరాలు తప్పులతడకగా నమోదయ్యాయి. దీంతో వాటిని సరిచేసి ఇవ్వాల్సిందిగా రెవెన్యూ అధికారులకు దరఖాస్తు చేశాడు. నాలుగు నెలలైనా సరైన వివరాలతో కూడిన ఈ-పాసుపుస్తకం మంజూరవలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం సమగ్ర వివరాలతో పాసు పుస్త కాలు ఇవ్వడం, ఒకవేళ తప్పులు దొర్లినా తొందరగా పాసు పుస్తకాలు ఇవ్వా లని, తప్పులతో సంబంధం లేకుండా అధికారుల సిఫారసుతో బ్యాంకులు రుణాలు ఇచ్చేవిధంగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



తెరచుకోని ఆరోగ్య కేంద్రం

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని పట్టణం ఇందిరానగర్‌లో డాక్టర్ వైఎస్ఆర్ పట్టణ ఆరోగ్య కేంద్రం ఆదివారం ఉదయం 10:30 గంటలైనా ఆరోగ్య కేంద్రం తెరచుకోలేదు. సీజనల్ వ్యాధులు సోకే కాలంలో ఆరోగ్య కేంద్రాలు మూసి ఉంటే ఎలా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. సంబంధిత అధికారుల పర్యవేక్షణ లోపంతో పేదలకు వైద్యం సరైనా సమయంలో అందడం లేదని డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు వీరేష్ ఆరోపించారు. సంబంధిత అధికారులు ఆరోగ్య కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.

ఎంపిటిసి కుటుంబానికి అండగా ఉంటాం

- గుమ్మనూరు సోదరులు

ప్రజాశక్తి- దేవనకొండ

మండల పరిధిలోని చెల్లెల చెలిమల గ్రామ ఎంపిటిసి పాడే రంగన్న అనారోగ్యంతో మృతి చెంద డంతో ఈ విషయం తెలుసుకున్న రాష్ట్ర ఉపాధి కార్మిక శాఖ మంత్రి సోదరులు గుమ్మనూర్ శ్రీనివాసు లు, నారాయణస్వామి ఆదివారం మృతదేహానికి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామ ర్శించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కుటుంబ సభ్యులకు రూ.20000 ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో మండలం ఎంపీపీ లక్ష్మీదేవి భర్త ముంబా, మండల జడ్పిటిసి కిట్టు, వైసిపి కన్వీనర్ కప్పట్రాళ్ల మల్లికార్జున పాల్గొన్నారు.



మృతదేహానికి నివాళులర్పించిన గుమ్మనూరు సోదరులు

ఆటో బోల్తా

- వృద్ధుడు మృతి

ప్రజాశక్తి -పెద్దకడబూరు



మృతి చెందిన సోమన్న

ఆటో బోల్తాపడి వృద్ధుడు మృతిచెందిన ఘటన మండలంలోని హనుమాపురంలో చోటు చేసుకుంది. ఎస్ఐ మహేష్ కుమార్ తెలిపిన వివరాల మేరకు.. ఆదివారం నాడు ఆటో డ్రైవర్ బోయ పరమేష్ తన ఆటోను అతివేగంగా నడపుతుండగా అనుమాపురం సమీపంలో నలంద డిగ్రీ కాలేజ్ వద్ద కుక్క అడ్డం రాగా ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో రాగిమాన్ దొడ్డికి చెందిన సోమన్న (61) తీవ్రంగా గాయపడి మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలు అయినట్లు అయ్యాయి. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

దేవరగట్టులో ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి -హోళగుంద

మండల పరిధిలోని నెరణికి, నెరణికి తండా దేవరగట్టు కొండ గుహలో వెలసిన శ్రీ మాల మల్లేశ్వరలకు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విరివిగా మొక్కులు తీర్చుకున్నారు. దేవరగట్టు ఆలయ కమిటీ చైర్మన్ గుమ్మూరు శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఉచిత అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ఘనంగా మారెమ్మ అవ్వ ఆలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి-ఆలూరు

ఆలూరు పట్టణంలోని గుంతకల్లు రోడ్డులో వెలసిన శ్రీ మారెమ్మ అవ్వ ఆలయ 14వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు దేవేంద్రప్ప, ఆలయ కమిటీ నిర్వాహకులు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ పెద్దలు గోపాలరెడ్డి, అందరాజు, చందు, రాము, తదితరులు పాల్గొన్నారు.



ఆలయం లో పూజలు నిర్వహిస్తున్న భక్తాదులు

పత్తికి ఎర్ర తెగుళ్లు...

- ఆందోళనలో రైతులు

ప్రజాశక్తి- దేవనకొండ



ఎర్ర తెగులు సోకిన పత్తి పైరు

ప్రకృతి వైపరీత్యాలు, అతివృష్టి, అనావృష్టి, నకిలీ విత్తనాలు తదితర కారణాలతో ప్రతి ఏటా పత్తి రైతు నష్టాలను చవిచూస్తున్నాడు. గత రెండేళు ్గా పత్తి రైతు అప్పుల ఊబిలోనే కోరుకుపోయాడు. ఈ ఖరీఫ్ సీజన్ లోనైనా అప్పుల ఊబి నుండి బయట పడుతానన్న ఆశతో జూన్ నెలలో కురిసిన తొలకరి వర్షాలకు దేవనకొండ మండలంలో పత్తి పంటను 33 వేల ఎకరాల్లో రైతులు సాగు చేశారు. అయితే పత్తి పంటకు ఎర్ర తెగుళ్లు సోకడంతో పత్తి పేరు గిడస బారి వడ తెగుళ్ళతో పత్తి మొలకలు దెబ్బతింటున్నాయని రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంటల సాగుకు దున్నకాలు, విత్తనాలు, ఎరువులకు, కూలీలకు ఎకరా పత్తి సాగుకు రూ.20000 పెట్టుబడి వస్తుందని తెగుళ్ల బారిన పడడంతో పెట్టిన పెట్టుబడి సైతం వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. అదేవిధంగా గత 20 రోజుల నుండి వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో వర్షాలు కురవక పత్తి పేర్లు వాడ ముఖం పడుతున్నా యని రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

వాతావరణ మార్పుతోనే తెగుళ్లు

- సురేష్ బాబు ఏవో



పత్తి పంటకు సోకుతున్న తెగుళ్లపై మండల వ్యవసాయ అధికారి సురేష్ బాబు దృష్టికి తీసు కెళ్లగా వాతావరణ మార్పుల వలన ఎర్ర తెగులు, వడలు తెగులు వ్యాపించడం జరిగిందన్నారు. ఈ తెగుళ్ళు సోకిన రైతులు అందోళన చెందాల్సిన అవసరం లేదనిపంటను కాపాడుకోవడానికి 19-19-19 లేదా 14-0-35 5 గ్రా. 1 ఒక లీటర్ నీటి కలుపుకొని మొక్క లు బాగా తడిచేటట్లు పిచికారి చేసుకోవాలన్నారు. వడలు తెగులు నివారణకు కాపర్ఆక్సిక్లోరైడ్(బ్లైటాక్స్) 3గ్రా" 1 ఒక లీటర్ నీటి కలుపుకొని మొక్కల మొదల దగ్గర వేసుకోవాలన్నారు.

పదోన్నతి పొందిన ఉద్యోగులకు సన్మానం

ప్రజాశక్తి - ఆదోని



ఆదోని పట్టణంలో నెహ్రూ మెమోరియల్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఇటీవలే స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ నుండి ప్రధానోపాధ్యాయులుగా, మండల విద్యాశాఖ అధికారులుగా, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ నుండి స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్‌గా పదోన్నతులు పొందిన నంద్యాల, కర్నూలు జిల్లాల వారికి ఆదోని జోన్ స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో ఆదివారం కర్నూలు జిల్లా స్కూల్ అసిస్టెంట్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ వారి నిర్వహణలో ఘనంగా సన్మానించి అభినందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు అలిం సిద్దికి సభా అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా నలుమూలల నుండి దాదాపు 70 మంది ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లు, ఫిజికల్ డైరెక్టర్లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ సంఘం అధ్యక్షులు ఏపీ రెడ్డి పాల్గొని మాట్లాడారు. ప్రధానోపాధ్యాయు లుగా పదోన్నతి పొందిన సురేష్ బాబు రాజు, భూపాల్ రెడ్డి, టీకే శ్రీనివాసని, రమణారెడ్డిలను, ఎంఈఓ గా పదోన్నతి పొందిన సుబ్రహ్మణ్యంను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు కళ్యాణ్ రావు, కర్నూలు జిల్లా స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనాథ్, పుల్లన్న, నిర్వాహ కార్యదర్శి మహేంద్ర, నంద్యాల జిల్లా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నాగరాజు, ఆదోని జోన్ స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు అంజనమ్మ, ముజాహిద్ తదితరులు పాల్గొన్నారు.

తప్పులు లేని ఓటర్ జాబితా చేయండి : కమిషనర్

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని మున్సిపాలిటీ పరిధిలో తప్పులు లేని ఓటర్ జాబితాను తయారు చేయడం లక్ష్యంగా సర్వే జరుగుతున్నదని మున్సిపల్ కమిషనర్, ఎన్నికల అదనపు అధికారి రఘునాథ్ రెడ్డి తెలిపారు. ఆదివారం పట్టణ ంలోని పింజర్ గిరి, వడ్డగేరి బీరప్ప కాలనీ పర్యటించి ఆయా వార్డులలో జరుగుతున్న ఓటర్ వెరిఫికేషన్‌ను మున్సిపల్ కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల వెరిఫికేషన్‌లో ఎక్కడ కూడా వార్డు వాలంటీర్లు పాల్గొనరాదని ఈ మేరకు బిఎల్ఓలకు ఆదేశాలు జారీ చేశామని స్పష్టం చేశారు. ఈనెల 21లోగా సర్వే పూర్తి అవుతుందని వివరించారు. ఆదోని పట్టణంలోని అన్ని పోలింగ్ బూత్ ల పరిధిలో ఓటర్ల వెరిఫికేషన్ బిఎల్ఓ లు ఆయా రాజకీయ పార్టీల ఎజెంట్ల ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి వెరిఫికేషన్ చేస్తున్నారని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ విజయభాస్కర్ రెడ్డి, ఆర్ఐ లవకుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఎలక్షన్ బిఎల్ఓ ల సర్వే పనితీరును పరిశీలించిన కమిషనర్

ఘనంగా ప్రపంచ ఆర్గాన్ డొనేషన్ డే

ప్రజాశక్తి - ఆదోని



కార్యక్రమంలో మాట్లాడిన డాక్టర్ గోపీనాథ్

ఆదోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్, లైయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం వరల్డ్ ఆర్గాన్ డొనేషన్ డేను ఘనంగా నిర్వహించారు. ఆదోనిలోని దేవి నర్సింగ్ హెూమ్ ఆవరణలో ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సెంట్రల్, స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్లు డాక్టర్ గోపీనాథ్, డాక్టర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ అవయవాల మార్పిడి కోసం దానం చేసే వ్యక్తులు ఎక్కువగా ఉంటే అవయవాలు మార్పిడి చేయవచ్చును. కిడ్నీలు, గుండె, ఊపిరితిత్తులు, కాలేయం, రక్తం, కండ్లు, చర్మము, ప్యాంక్రియాస్ తదితర అవయవ దానానికి పనికొస్తాయన్నారు. ప్రతి మనిషి దాదాపుగా ఏడు, ఎనిమిది మందికి మళ్లీ పునర్జన్మ ఇచ్చినట్లుగా భావించాలన్నారు. అవయవ దానంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమం లో డాక్టర్ హరీష్, డాక్టర్ అనూష, లైయన్స్ క్లబ్ అధ్యక్షులు ధర్మారెడ్డి, రీజియన్ చైర్మన్ ప్రసాద్ రావు పాల్గొన్నారు.

కెజిబివి విద్యార్థి ప్రతిభ

అమెరికా టూర్‌కు కౌతాళం విద్యార్థిని

ప్రజాశక్తి - కౌతాళం



శివలింగమ్మతో తల్లిదండ్రులు

రాష్ట్రంలో అక్షరాస్యతలో అత్యంత వెనుకబడిన మండలాలలో ఒకటైన కౌతాళం మండలంలో విద్య కుసుమం వికసించింది. జిల్లాలోని పశ్చిమ ప్రాంతమైన, కర్ణాటక సరిహద్దు మండల మైన కౌతాళం మండలంలోని పొదలకుంట గ్రామానికి చెందిన విద్యార్థిని, రాష్ట్రస్థాయిలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన ఎడ్యుకేషన్ టూర్ కింద కర్నూలు జిల్లా నుండి ఎంపిక కావడం విశేషం. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని వదలకుంట గ్రామానికి చెందిన సోమనాథ్ గంగమ్మ దంపతులకు నలుగురు సంతానం. ఇందులో చివరి అమ్మాయి అయినా శివలింగమ్మ ఆదోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో పదవ తరగతి పరీక్షలలో జిల్లాలోని మూడో స్థానంలో నిలిచింది. ఈనెల రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి అమలు చేస్తున్న పథకాలపై నిర్వహించిన పరీక్షలలో శివ గంగమ్మ ఎంపికై, 8వ తేదీ ఆదోని మున్సిపల్ హైస్కూల్లో స్పీకింగ్ టెస్ట్‌లో పాల్గొనడం జరిగింది. శివలింగమ్మ ప్రభుత్వ పథకాల పట్ల ఇంగ్లీషులో అద్భుతంగా మాట్లాడి రాష్ట్ర స్థాయి అధికారుల దృష్టిని ఆకర్షించింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ఎంపికైన పదిమంది విద్యార్థినులలో కర్నూలు జిల్లా నుండి శివలింగమ్మ ఎంపికైనట్లు విజయవాడ నుండి తల్లిదండ్రులకు ఫోన్ ద్వారా తెలిసిన్నట్లు విద్యార్థిని తల్లిదండ్రులు తెలిపారు. విదేశాలకు పంపడానికి ఆర్థిక స్తోమత తమకు లేదని తల్లితండ్రులు ఆ అధికారులకు వివరించగా, ఎడ్యుకేషన్ టూర్ సందర్భంగా విద్యార్థినిలకు రాష్ట్ర ప్రభుత్వమే మొత్తం భరిస్తుందని అధికారులు తెలపడంతో విద్యార్థిని తల్లిదండ్రుల ఆనందం అంతాఇంతా కాదు. తమ కూతురు ఎంపిక కావడం పట్ల తల్లిదండ్రులు సోమనాథ్, గంగమ్మ హర్షం వ్యక్తం చేశారు. శివలింగమ్మ న్యూయార్క్‌లోని ఐక్యరాజ్య సమితి సదస్సులో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విద్యా విధానంపై ప్రసంగించనుంది.

శ్రీమఠంలో భక్తుల కోలాహలం

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన శ్రీ రాఘవేంద్రస్వామి మఠంలో భక్తుల కోలాహలం నెలకొంది. ఆదివారం రాఘవేంద్రుని దర్శనార్థమై దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో మంత్రాలయం చేరుకున్నారు. గ్రామ దేవత మంచాలమ్మను రాఘవేంద్రుని మూల బందావనాన్ని దర్శించుకునేందుకు బారులు తీరారు. స్వామి వారికి ప్రత్యేక సేవలు చేయించిన భక్తుల సమక్షంలో రాఘవేంద్రుని బృందావన ప్రతిమకు శ్రీ మఠం దివాన్ సుధీంద్రాచార్ విశేష పూజలు నిర్వహించి మంగళ హారతులు ఇచ్చారు. అనంతరం బందావన ప్రతిమను స్వర్ణ పల్లకీలో ఉంచి వేద మంత్రాలతో మంగళ వాయిద్యాల నడుమ శ్రీ మఠం ప్రాకారంలో వైభవంగా ఊరేగించారు. ఈ సందర్భంగా పల్లకీ సేవ చేయించిన భక్తులకు ఫల మంత్రాక్షతలు అందజేసి ఆశీర్వదించారు.



కార్ పార్కింగ్ గా మారిన ప్రధాన జాతీయ రహదారి

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలోని జాతీయ రహదారి 167తో పాటు కారు పార్కింగ్‌గా మారి ప్రయాణికులకు ఇబ్బం దులు కలిగించింది. పలు రాష్ట్రాల నుండి వాహనాల ద్వారా వచ్చిన భక్తులు పార్కింగ్ స్థలం లేక ప్రధాన రహదారినే పార్కింగ్ స్థలంగా మార్చుకున్నారు. రాఘవేంద్ర సర్కిల్లో ఉన్న ఆర్చి వద్ద నుంచి శ్రీ మఠం ప్రధాన ఆర్చి వరకు రోడ్డు కు ఇరువైపులా వాహనాలను నిలపడంతో భక్తులతో గ్రామస్తులు పాదాచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రాఘవేంద్ర సర్కిల్ నుంచి మాధవరం వైపు వెళ్లే జాతీయ రహదారిపై కూడా వాహనాలు నిలిచిపోగా వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కారు పార్కింగ్ సౌకర్యం కోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని భక్తులు, గ్రామస్తులు కోరుతున్నారు.

స్వర్ణ మయమైన మూల బృందావనం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన శ్రీ రాఘవేంద్రస్వామి మఠంలో రాఘవేంద్రుని మూల బృందావనం స్వర్ణ మయమై భక్తులకు దర్శన మిచ్చారు. పూజలనంతరం బృందావనాన్ని స్వర్ణకవచాలతో పట్టు వస్త్రా లతో వివిధ పుష్ప హారాలతో అందంగా అలంకరిచారు.



ట్రాఫిక్ జామ్ అయిన దృశ్యం



యాప్ కష్టాలు

- ఉపాధ్యాయులపై పెరుగుతున్న భారం
- కొత్తగా ప్రశస్త యాప్

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

ప్రభుత్వ ఉపాధ్యాయులపై రోజురోజుకు యాప్‌ల భారం పెరిగిపోతోంది. ఇప్పటికే బోధనేతర పనులతో సతమతమవుతుండగా దీనికి తోడు ప్రతి పనికీ ఒక యాప్ రూపొందించి అందులో వివరాలు నమోదు చేయాలని ఒత్తిడి తెస్తుండటం సమస్యగా మారింది. ఫలితంగా ఉపాధ్యాయులు పాఠాలు సరిగా చెప్పలేని పరిస్థితి నెలకొంది.

కర్నూలు జిల్లాలో 1,437, నంద్యాల జిల్లాలో 1,368 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వీటి పరిధిలో 4,09,288 మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రాథమిక పాఠశాలల్లో చాలాచోట్ల ఒకరిద్దరు ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారు. వీరు విద్యాలయాలకు వచ్చినప్పటి నుంచి ఉన్న ఐదు తరగతులను పంచుకుని పాఠాలు చెప్పాలి. కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో విద్యార్థుల చేరికలు, వారి వివరాలు ఆన్లైన్ చేయడం, జగనన్న విద్యా కానుక పంపిణీ, నాడు-నేడు పనులు చూసుకున్న తర్వాతే తరగతులు నిర్వహించాలి. చాలా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ఏకోపాధ్యాయులు పని చేస్తున్నారు. ఉదయం 8.30 గంటలకు పాఠశాల ప్రారంభమైతే ముందుగా మరుగుదొడ్ల చిత్రాలు తీయాలి. ఆ తర్వాత విద్యార్థుల హాజరు నమోదు చేయాలి. బియ్యం, గుడ్లు, చిక్కీల చిత్రాలు, వివరాలు తీసుకోవడంతోపాటు వాటిని ఆన్లైన్లో అప్లోడ్ చేయాలి. ఆ తర్వాతే తాను బోధించే మూడు తరగతులకు సంబంధించిన వర్క్ పుస్తకాలు రాయించాలి. ఇప్పుడున్న యాప్లతోనే ఇబ్బందులు పడుతున్నామని ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. వీటికితోడు ప్రస్తుతం కొత్తగా ప్రశస్త పేరుతో యాప్‌ను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఇది ప్రత్యేక అవసరాల విద్యార్థులకు సంబంధించినది. ఇందులో విద్యార్థి, వారి తల్లిదండ్రుల పేర్లు, పుట్టిన తేదీ, పాఠశాల ప్రవేశ సంఖ్య వివరాలు నమోదు చేసి పంపాల్సి ఉంటుంది. తర్వాత ఒక్కో విద్యార్థికి సంబంధించి 30కి పైగా ప్రశ్నలు ఉంటాయి. వాటిని పూర్తి చేయాలి. పాఠశాల పేరిట ఉన్న జీ మెయిల్ ద్వారా అనుసంధానం చేసుకోవాలి. ఈ ప్రక్రియ తెలియక చాలామంది ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉంది. దీనికి తోడు వివిధ పనుల కారణంగా ఒత్తిడికి గురవుతున్నారని ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పెరుగుతున్న భారం...

ఉపాధ్యాయుడు సగటున మూడు తరగతులు బోధించడంతో పాటు వాటికి సంబంధించిన వర్క్ పుస్తకాలు పూర్తి చేయించాలి. 1, 2 తరగతులకు మూడేసి సబ్జెక్టులు, 3, 4, 5వ తరగతుల విద్యార్థికి నాలుగేసి సబ్జెక్టులు ఉంటాయి. ప్రతి సబ్జెక్టుకు సంబంధించి ఒక పాఠానికి వర్క్ బుక్‌లో కనీసం 10 పేజీలు రాయించాల్సి ఉంటుంది. ఈ ప్రకారం ఒక విద్యార్థితో కనీసం 40 పేజీలు రాయించాల్సి ఉంటుంది. నెలలో రెండు అధ్యాయాలు ఉంటే 80 పేజీలు రాయించాలి. ఒక తరగతికి 20 మంది ఉంటే 800 పేజీలు దిద్దాల్సి ఉంటుంది. గతేడాది నుంచి టరల్ (టీచింగ్ ఎట్ రైట్ లెవల్) విధానాన్ని మళ్లీ తీసుకొచ్చారు. 3, 4, 5 తరగతుల విద్యార్థులకు తెలుగు, ఆంగ్లంలో గంట చొప్పున ఆ మెటీరియల్ పూర్తి చేయించాలి. ఇదికాక కొత్తగా టోఫెల్ అని పెట్టారు. ఇలా పలు బాధ్యతలతో ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు.

బిల్లుల మంజూరులో జాప్యం చేస్తే చర్యలు

- వేగవంతంగా జగనన్న ఇళ్ల నిర్మాణాలు
- అర్హులైన ప్రతి నిరుపేదకు ఇళ్లు మంజూరు
- హౌసింగ్ పీడీ భాస్కర్ నాయుడు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

'జిల్లాలో జగనన్న ఇళ్ల నిర్మాణాలు వేగవంతంగా జరుగుతున్నాయి. అర్హులైన ప్రతి నిరుపేదకు ఇళ్లు మంజూరు చేశాం. బిల్లుల మంజూరులో హౌసింగ్ సిబ్బంది లబ్ధిదారులకు ఇబ్బందులకు గురి చేస్తే, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. లబ్ధిదారులు ఎవరైనా ఇబ్బందులు పడుతుంటే మా దృష్టికి తీసుకు రావాలి. వాస్తవాలను విచారించి బిల్లులు మంజూరు చేస్తాం. ఇళ్ల నిర్మాణాల్లో ఉన్న లబ్ధిదారులకు బిల్లుల మంజూరులో సిబ్బంది జాప్యం చేస్తే చర్యలు తప్పవు' అని హౌసింగ్ పీడీ భాస్కర్ నాయుడు హెచ్చరించారు. నంద్యాల జిల్లాలో జగనన్న లేఔట్లు, హౌసింగ్ కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలపై హౌసింగ్ పీడీ భాస్కర్ నాయుడు ప్రజాశక్తితో ముఖాముఖీ మాట్లాడారు.

జిల్లాలో జగనన్న కాలనీల పరిస్థితి ఏమిటి..?

హౌసింగ్ పీడీ : నంద్యాల జిల్లాలో నవరత్నాలు పేరుతో అందరికీ ఇళ్లు కార్యక్రమం కింద జిల్లాలో 37 లే ఔట్‌లలో 19,341 ఇళ్లు కడుతున్నాము. సొంత పట్టాలు, సొంత స్థలాలు ఉన్న వారికి 24,041 ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసింది. ఇళ్లు లేని నిరుపేదలందరికీ ఇళ్లు కట్టించి ఇవ్వాలన్నది ప్రభుత్వం లక్ష్యం.

జిల్లాలో ఎన్ని ఇళ్లను ప్రారంభించారు.. మిగతావి ఏఏ దశల్లో ఉన్నాయి..?

హౌసింగ్ పీడీ : జిల్లాలో 43,321 ఇళ్లను ప్రారంభించాం. రెంటల్ లెవల్ 17,168 పూర్తి అయ్యాయి. వీటిలో లే అవుట్స్ 3,545 పూర్తి కాగా, సొంత స్థలాలలో 13,623 ఇళ్లు పూర్తయ్యాయి. అందుకు దాదాపుగా రూ.4.49 కోట్లు బిల్లులు చెల్లింపులు చేశాం.

పిఎం ఆవాజ్ యోజన కింద ఎన్ని ఇళ్లు మంజూరు అయ్యాయి?

హౌసింగ్ పీడీ : పిఎం ఆవాజ్ యోజన కింద



12,967 ఇళ్లు మంజూరు అయ్యాయి. అందులో 660 ఇళ్లు పూర్తి అయ్యాయి. ఇంకా మొదలు కానివి 2037 ఇళ్లు ఉన్నాయి. బిలో బేస్ మట్టం 8,354, బేస్ మట్టం లెవల్ 858, రెంటల్ లెవల్ 600, ఆర్‌సి స్థాయిలో 458 ఉన్నాయి. అందుకు రూ.22.21 కోట్లు చెల్లింపులు చేశాం.

ఈ ఇళ్లను ఎప్పటిలోగా పూర్తి చేయాలని టార్గెట్ పెట్టుకున్నారు..?

హౌసింగ్ పీడీ : ఈ నెల చివరిలోపు రాష్ట్రంలో దాదాపు 5 లక్షలు ఇళ్లు టార్గెట్ పూర్తి చేయాలని ఉంది. అందులో నంద్యాల జిల్లాలో 20,145 ఇళ్లు పూర్తి చేయాలని టార్గెట్. అందులో ఇప్పటివరకు 19,638 ఇళ్లు ఆర్‌సి స్థాయిలో పూర్తి చేశాం.



విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు

ప్రజాశక్తి - నంద్యాల

విద్యుత్ ఉద్యోగుల సమస్యల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వీడి తక్షణమే పరిష్కరించాలని సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వి.యేసురత్నం, ఎ.నాగరాజు డిమాండ్ చేశారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ గత సంవత్సర కాలంగా 1104 సారథ్యంలోని పవర్ జెఎసి 23 సార్లు జాయింట్‌గా, కొన్ని సార్లు విడివిడిగా మొక్కుబడి మీటింగ్‌లు జరిపిందని, ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు, జెఎల్ఎం గ్రేడ్-2ల సమస్యల పరిష్కారంలో పవర్ జెఎసి విఫలమయ్యిందని అన్నారు. ఏ ఉద్యమాలకు పిలుపునివ్వకుండా, మొక్కుబడిగా చేయటం, రాష్ట్ర ప్రభుత్వం ఎన్జిఓ సంఘాలను లోబర్చుకొని రివర్స్ పిఆర్సిని ప్రకటించిందని చెప్పారు. అదే పద్ధతిని విద్యుత్ రంగంలో కూడా ప్రయోగించాలని రాష్ట్ర ప్రభుత్వం కుట్రచేస్తుందని తెలిపారు. ఆ కుట్రతో జెఎసి నాయకత్వం ఉద్యోగుల ఉసురు తీస్తుందని, విద్యుత్ రంగ కార్మికుల పోరాట చరిత్రను రాష్ట్రప్రభుత్వం విస్మరిస్తే చరిత్ర క్షమించదని, తక్షణం విద్యుత్ రంగంలోనే రెగ్యులర్ ఉద్యోగులు, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులందరి సమస్యల్ని పరిష్కరించాలని డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న సిఐటియు అధ్యక్ష కార్యదర్శులు ఏసురత్నం, నాగరాజు

విద్యుత్ కార్మికులకు జీతాలు చాలా ఎక్కువని అధికారులు చర్చల్లో అవహేళన చేస్తున్నారని అన్నారు. గత పిఆర్సి పూర్తి అయ్యి సంవత్సరం దాటినా వేతన ఒప్పందానికి ప్రభుత్వం సిద్ధపడటంలేదన్నారు. విద్యుత్ కార్మికులంటే ఎంత చిన్న చూపో ఇప్పటికైనా కార్మికులు గుర్తించాలన్నారు. తెలంగాణాలో కాంట్రాక్ట్ స్కిల్డ్ కార్మికులకు నెలకు రూ. 43,162 ఇస్తుంటే ఆంధ్రప్రదేశ్లో మాత్రం రూ.20,598 మాత్రమే చెల్లిస్తున్నారని అన్నారు. కాంట్రాక్ట్ కార్మికులు, ఎనర్జీ అసిస్టెంట్లు విధి నిర్వహణలో ప్రమాదాలకు గురై పిట్టల్లా రాలిపోతున్నా వీరి కుటుంబాలను ఆదుకోవడంలో, కారుణ్య నియామకాలలో అడ్డగోలు నిబంధనలు పెడుతున్నారని తెలిపారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం 10,117 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని నిర్ణయించిందని, విద్యుత్ రంగంలోనే కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయడంలో పరిగణలోకి తీసుకోకపోవడం అన్యాయమన్నారు. విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై సలహా కమిటీల పేరుతో కాలయాపన చేయడం యాజమాన్యానికి పరిపాటిగా మారిందన్నారు. వేతనాలు పెంచకపోగా ఉన్న సౌకర్యాలను కుదించడం, కొత్త ఆపరేటర్లకు నెలకు రూ.15 వేలు ఇవ్వడం, కారుణ్య నియామకం అయిన వారికి నెలకు రూ. 12 వేలు మాత్రమే ఇవ్వడం లాంటి తిరోగమన చర్యలపై తిరగబడాలన్నారు. ప్రభుత్వ విధానాలు మారకపోతే విద్యుత్ రంగంలో పెనుమార్పులు రాకతప్పదని, ప్రజా ఉద్యమాలు, కార్మికుల జీతాల్లో కోతలు విధిస్తే భారీ పోరాటాలు తప్పవన్నారు. విద్యుత్ కార్మికులకు మెరుగైన పిఆర్సిని ప్రకటించాలని, కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చెయ్యాలని డిమాండ్ చేశారు. విద్యుత్ ఉద్యోగులు చేయబోయే ఏ పోరాటానికైనా సిఐటియు సంపూర్ణ మద్దతును తెలియజేస్తుందని, విద్యుత్ ఉద్యోగులు పోరాటలకు సిద్ధపడాలని కోరారు.

అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి - పాములపాడు

పాములపాడు మండలం భానుముక్కల గ్రామానికి చెందిన కౌలు రైతు చాకలి సాంబశివుడు (37) అప్పుల బాధ తాళలేక శనివారం రాత్రి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన చోటు చేసుకుంది. ఆదివారం పాములపాడు ఏఎస్ఐ యేసయ్య గ్రామానికి వెళ్లి పరిశీలించారు. ఎఎస్ఐ తెలిపిన వివరాల మేరకు... భానుముక్కల గ్రామానికి చెందిన చాకలి సాంబశివుడు గత మూడు సంవత్సరాలుగా మూడు ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకొని వ్యవసాయం చేసేవాడు. వరుసగా పంట సరిగా రాక దాదాపు 5 లక్షలు అప్పు మిగలడంతో తీర్చలేమోనని మనస్థాపం చెంది ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతునికి భార్య, ఇద్దరు కూతుర్లు, ఒక కుమారుడు ఉన్నారు. భార్య వెంకట లక్ష్మమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.



మృతి చెందిన కౌలు రైతు

క్రికెట్ ఆడుతూ యువకుడు మృతి

ప్రజాశక్తి - బేతంచెర్ల

బేతంచర్లలోని సంజీవ నగర్ కాలనీకి చెందిన ఎన్.తిమ్మప్ప కుమారుడు ఎన్.మహేంద్ర (21) క్రికెట్ ఆడుతూ అకస్మాత్తుగా కుప్పకూలి మృతి చెందిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. ఆదివారం కావడంతో యువకులంతా కలిసి సంజీవ నగర్ కాలనీలో ఉన్న హెచ్‌పి గ్యాస్ గోడౌన్ దగ్గర ఉన్న ఖాళీ స్థలంలో క్రికెట్ ఆడుతున్నారు. మహేంద్ర క్రికెట్ ఆడుతూ అకస్మాత్తుగా కుప్పకూలి కిందపడ్డాడు. తోటి స్నేహితులు హుటా హుటిన స్థానిక ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కుమారుడి మృతితో తల్లిదండ్రుల రోధనలు మిన్నంటాయి.



ఎన్.మహేంద్ర (ఫైల్)

స్వాతంత్ర జాగరణను జయప్రదం చేయండి

- ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి అనిల్ కుమార్

ప్రజాశక్తి - నంద్యాల

ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 10:30 నుండి సాయంత్రం 4 గంటలకు వరకు రామక్రిష్ణ డిగ్రీ కాలేజీలో ప్రదర్శనలు ఉంటాయని, రెండు రోజులు పాటు శిక్షణ పొందిన 60 మంది కళాకారులచే పాటలు, కోలాటం, డాన్స్, నాటికలు ప్రదర్శిస్తున్నామని, ప్రజలు తిలకించి జయప్రదం చేయాలని ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి అనిల్ కుమార్ పిలుపున్చారు. కోరారు. నంద్యాలలో ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో రెండవ రోజు ఆదివారం పాటలు, డాన్స్, కోలాటం శిక్షణ కార్యక్రమాలు జరిగాయి. ఈ శిక్షణను ఉద్దేశించి ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి అనిల్ కుమార్, ఉపాధ్యక్షులు ఇ.నాగరాజు మాట్లాడారు. మణిపూర్‌లో మహిళలపై జరిగిన దాడులకు వ్యతిరేఖంగా పాటలు, నాటికలపై శిక్షణ ఇచ్చామన్నారు. స్వాతంత్రం వచ్చి 75సంవత్సరాలు నిండిన నేటికీ మహిళలకు స్వేచలేకపోవడం బాధాకరమన్నారు. జిల్లా కన్వీనర్ కోయలకొండ నాగరాజు మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో 60 మంది కళకారులు పాల్గొంటారని, కళలకు ఆదరణ కల్పించడానికే ప్రజానాట్యమండలి కృషి చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో కళకారులు డాల్ వెంకటేశ్వర్లు, ఆరోగ్యం, సుధాకర్, బతుకన్న, నిర్మలమ్మ, వెంకటమ్మ, మరియమ్మ, సావిత్రి, కైరున్, నాగలక్ష్మి బంగారం, వెంకటయ్య, శేషు, కృష్ణవేణి, రామచంద్రుడు శివ, సౌలోచన, సౌజన్య తదితర కళకారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి అనిల్ కుమార్



ప్రపంచ అవయవ దాన దినోత్సవం అవగాహన కరపత్రాలు విడుదల చేస్తున్న గురు రాఘవేంద్ర విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ దస్తగిరి రెడ్డి, ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ జి.రవికృష్ణ

ఘనంగా ప్రపంచ అవయవ దాన దినోత్సవం

ప్రజాశక్తి - నంద్యాల

నంద్యాలలోని శ్రీ గురు రాఘేంద్ర బ్యాంకు కోచింగ్ కేంద్రంలో ఆదివారం ప్రపంచ అవయవ దాన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. నంద్యాల ఐఎంఏ, లయన్స్ క్లబ్ సంయుక్తంగా అవగాహన సదస్సు నిర్వహించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు పీ.వీ. సుధాకర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో శ్రీ గురు రాఘవేంద్ర విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ పి. దస్తగిరి రెడ్డి, ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ జి.రవికృష్ణ సీనియర్ వైద్యులు డాక్టర్ గెలివి సహదేవుడు, ఐఎంఏ నంద్యాల అధ్యక్షులు, జిల్లా వైద్య విధాన పరిషత్ కోఆర్డినేటర్ డాక్టర్ జఫరుల్లా పాల్గొని విద్యార్థులకు అవయవ దాన ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అవయవ దానంపై ప్రజా అవగాహన కరపత్రాన్ని విడుదల చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కార్యదర్శి సోమేసుల నాగరాజు, కోశాధికారి మామిళ్ల నాగరాజు, అధిక సంఖ్యలో బ్యాంక్ కోచింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - పాములపాడు

పాములపాడులోని జెరూసలేం ప్రార్థనశాలలో ఆదివారం నంద్యాల గవర్నమెంట్ హాస్పిటల్ డాక్టర్ చిన్న నాగన్న ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. చర్చిలో ప్రార్థనకు వచ్చిన వారందరికీ బిపి, షుగర్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు, సిరప్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది వి.శ్వేత, డోరకమ్మ, శిరీష, ఎస్తేరు, జెరూసలేం శాల పాస్టర్ శాంసన్, ఎఫ్రా. పాస్టరమ్మ, మణిమాలమ్మ, సంఘ పెద్దలు పాల్గొన్నారు.



పరీక్షలు నిర్వహించి మందుల పంపిణీ చేస్తున్న దృశ్యం

స్వయం ఉపాధితో జీవనోపాధి మెరుగుపరుచుకోవాలి

ప్రజాశక్తి - బనగానపల్లె

యువత స్వయం ఉపాధితో జీవనోపాధిని మెరుగుపరచుకోవాలని వైసిపి యువ నాయకులు కాటసాని ఓబుల్ రెడ్డి, అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డిలు పేర్కొన్నారు. ఆదివారం పట్టణం లోని యాగంటి పల్లె రహదారిలో 1 కోటి రూపాయలతో వైసిపి నాయకులు అబ్దుల్ ఫైజ్ అతని కుమారుడు ఉబేద్ నూతనంగా ఏర్పాటు చేసిన ఎఫ్ఎం గ్రీన్ ఇండస్ట్రీని వైసిపి యువ నాయకులు కాటసాని ఓబుల్ రెడ్డి, నియోజకవర్గ నాయకులు కాటసాని ప్రసాద్ రెడ్డి, అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత స్వయం ఉపాధి వైపు అడుగులు వేయాలని, పది మందికి ఉపాధి కల్పించాలన్నారు. ప్రభుత్వం పరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సహిస్తుందని తెలిపారు. నియోజకవర్గంలో యువత ఇండస్ట్రీ, ఫ్యాక్టరీలను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో వైసిపి నియోజకవర్గ నాయకులు కాటసాని చంద్రశేఖర్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి గుండం శేషిరెడ్డి, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు గుండం నాగేశ్వర రెడ్డి ప్రచార కార్యదర్శి సిద్ధం రెడ్డి రామ్మోహన్ రెడ్డి, ఎంపీడీవో ఎంపీపీ మానసవీణ, మండల ఉపాధ్యక్షురాలు మంగవరపు లక్ష్మీదేవి, తమ్మడపల్లె సర్పంచ్ వెంకట్రామిరెడ్డి, వైసిపి రైతు విభాగం మాజీ జిల్లా అధ్యక్షుడు మంగవరపు శివరామిరెడ్డి, కేజిఆర్ విద్యాసంస్థల అధినేత కంకర రామచంద్రారెడ్డి , డాక్టర్ రవికుమార్, నూకల వెంకట సుబ్బయ్య, వైసిపి నాయకులు బండి బ్రహ్మానందరెడ్డి, ఎర్రగుడి రామసుబ్బారెడ్డి, సైకిల్ షాప్ మహబూబ్ వలి, అంబటి రవి కుమార్ రెడ్డి, ఈశ్వర్ నాయక్, బిల్డర్ మగ్బూల్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.



ఫ్యాక్టరీని ప్రారంభిస్తున్న కాటసాని ఓబుల్ రెడ్డి, కాటసాని తిరుపాల్ రెడ్డి

మణిపూర్‌లో శాంతి నెలకొల్పాలని ర్యాలీ

ప్రజాశక్తి - అవుకు

మణిపూర్‌లో జరుగుతున్న వరుస ఘటనలపై కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుని శాంతిని నెలకొల్పాలని సిపిఎం, ఎమ్మార్పీఎస్, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం అవుకు పట్టణంలో సిపిఎం, ఎమ్మార్పీఎస్, వివిధ ప్రజాసంఘాల నాయకులు శాంతి ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్ ఆవరణలో మణిపూర్‌లో మహిళలపై జరుగుతున్న అన్యాయాలపై 72 రోజులు దాటినా ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంపై నిరసన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా శాంతిని నెలకొల్పకపోతే ప్రజలు తగిన బుద్ధి చెబుతారని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కాళింగి రాముడు, ఎమ్మార్పీఎస్ నాయకులు పెద్ద ముని, మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు కెడిఎం సుబ్బరాయుడు, అధ్యక్షుడు దాస్, వడ్డే సంఘం నాయకులు శిల్పి సుబ్బరాయుడు, సేవకుడు అబ్రహం, బాలాజీ, స్టీఫెన్, యోహాను, సికామణి, నాగరాజు, మహమ్మద్ రఫీ, కృష్ణయ్య, శ్రీనివాసులు, మద్దయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రజాసంఘాల నాయకులు

బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి ఎన్‌టిఆర్ : మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి టిడిపి వ్యవస్థాపక అధ్యక్షులు, దివంగత ఉమ్మడి ఎపి మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు అని శ్రీశైలం మాజీ శాసనసభ్యులు బుడ్డా రాజశేఖర్ రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని వెంగళ్రెడ్డి పేట గ్రామంలో నాయకులు తోట శివయ్య, మండల అధ్యక్షుడు నందిపాటి నరసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి సిద్దయ్య, శ్రీశైలం నియోజకవర్గం తెలుగు యువత అధ్యక్షుడు బొల్లవరం మల్లేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన నందమూరి తారక రామారావు విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయలసీమకు పోతిరెడ్డిపాడు ద్వారా తెలుగు గంగ ప్రాజెక్టుకు సాగు, తాగునీరు ఇచ్చి రాయలసీమ కరువు దూరం చేశారన్నారు. అలాంటి మహా నేతకు ప్రతి గ్రామంలో విగ్రహాలు పెట్టాలని కోరారు. తెలుగు గంగ ప్రాజెక్టు ద్వారా వెలుగోడు, బండి ఆత్మకూరు, మహానంది, రుద్రవరం, ఆళ్లగడ్డ, చాగలమర్రి మండలాలు రెండు కార్ల పంటలతో సశస్యమలంగా ఉన్నాయని చెప్పారు. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని, ప్రజలందరూ ఆలోచించి రాబోయే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.



వెంగల్‌రెడ్డి పేట గ్రామంలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే



కళాకారున్ని సన్మానిస్తున్న దృశ్యం

కళాకారులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - బనగానపల్లె : కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలని శ్రీ జెకెఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు జేఎస్ఎస్ బ్రహ్మానంద ఆచారి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని పలుకూరు గ్రామంలో శ్రీ జెకెఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జెఎస్ఎస్ బ్రహ్మానందచారి ఆధ్వర్యంలో గ్రామంలోని రామాలయంలో సీనియర్ కళాకారుడు బాల హనుమంతుకు ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన మనం ఫౌండేషన్ అధ్యక్షుడు లాయర్ చక్రవర్తిగాంధీ పురస్కారం ఇచ్చిన సందర్భాన్ని పురస్కరించుకొని అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా బాల హనుమంతును సన్మానించారు. ఈ సందర్భంగా బ్రహ్మాందచారి మాట్లాడుతూ కళాకారులను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలన్నారు. 40 సంవత్సరాల నుంచి హార్మోనిస్టుగా పని చేస్తు భక్తి మార్గం అభివృద్ధికి బాల హనుమంతు కృషికి నిదర్శనమే ఈ పురస్కారం అన్నారు. సన్మాన గ్రహీత బాల హనుమంతు మాట్లాడుతూ తనకు అవార్డు ఇచ్చిన మనం ఫౌండేషన్ అధ్యక్షుడు లాయర్ చక్రవర్తికి, తనను అభినందించిన వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో బాల సరస్వతీ భజన మండలిసెక్రెటరీ కేఈ వెంకటసుబ్బయ్య గౌడు, తెలుగు భాష అభివృద్ధి సంఘం అధ్యక్షుడు రాజు, జగదీశ్వర చారి, దస్తగిరి, భక్త బృందం పాల్గొన్నారు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి - పాములపాడు : పాములపాడు మండలం ఎర్రగుడూరు గ్రామ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వెలుగోడు మండలం గుంతకందాల గ్రామానికి చెందిన నాగేంద్ర గౌడ్ (26) మృతి చెందాడు. స్థానికుల వివరాల మేరకు నాగేంద్ర గౌడ్ మోటార్ సైకిల్‌పై ఆత్మకూరు వెళుతున్న క్రమంలో కర్ణాటక రాష్ట్రం బెల్గావ్‌కు చెందిన కారు శ్రీశైలం నుండి కర్ణాటకకు వెళ్లే క్రమంలో ఎర్ర గూడూరు సమీపంలో మోటార్ సైకిల్‌ను ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన నాగేంద్ర గౌడ్‌ను వెంటనే స్థానికులు పాములపాడు వైద్య శాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్ నిర్ధారించారు. ఈ ఘటనపై పాములపాడు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



మృతి చెందిన నాగేంద్ర గౌడ్


తిరుమల సన్నిధిలో శ్రీకాళహస్తి ఎమ్మెల్యేతో ఇరిగెల

తిరుమల వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న ఇరిగెల

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ప్రముఖ పుణ్యక్షేత్రమైన తిరుమల వెంకటేశ్వర స్వామిని వైసిపి ఆళ్లగడ్డ తాలూకా సీనియర్ నాయకులు ఇరిగెల సూర్యనారాయణ రెడ్డి దర్శించుకున్నారు. ఆదివారం శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డితో కలిసి ఇరిగెల సూర్యనారాయణ రెడ్డి తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు.

జిల్లా స్థాయి పోటీల్లో ఆళ్లగడ్డ క్రీడాకారుల ప్రతిభ

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

నంద్యాలలోని ఆర్‌జిఎం ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం నిర్వహించిన జిల్లాస్థాయి బాస్కెట్ బాల్ పోటీలలో ఆళ్లగడ్డ నుండి విశ్వశాంతి స్కూల్ జట్టు, ఆర్‌ఆర్ అకాడమీ జట్లు పాల్గొని ప్రతిభ చాటారు. మొదటిసారిగా ఆళ్లగడ్డ నుండి బాస్కెట్ బాల్ పోటీలలో పాల్గొన్న జట్లు మంచి ప్రదర్శన కనబరిచాయి. ఈ పోటీలలో విశ్వశాంతి స్కూల్ జట్టు, ఆర్‌ఆర్ అకాడమీ జట్టు (అండర్-14) జాయింట్ విన్నర్స్‌గా నిలిచారు. ఈ పోటీలను ఆర్‌జిఎం ఇంజనీరింగ్ కాలేజ్ స్పోర్ట్స్ డైరెక్టర్ వెంకటేష్, ఆర్ ఆర్ అకాడమీ కోచ్ సుబ్బారాయుడు, ఎస్‌డిఆర్ స్కూల్ వ్యాయామ ఉపాధ్యాయుడు నవీన్ కుమార్, కోచ్ ఓబులేసు ప్రారంభించారు. ఈ టోర్నమెంటులో 10 జట్లు పాల్గొన్నాయని నిర్వాహకులు తెలిపారు. స్పోర్ట్స్ డైరెక్టర్ వెంకటేష్ మాట్లాడుతూ నంద్యాల జిల్లాను బాస్కెట్ బాల్ క్రీడాకారులను తయారు చేయడానికి తమ వంతు సహాయ సహకారాలు ఎప్పటికీ ఉంటాయన్నారు. ఆళ్లగడ్డ నుంచి బాస్కెట్ బాల్ ఆటను ప్రోత్సహిస్తున్న విశ్వశాంతి స్కూల్, సోముల రమణారెడ్డి ఆర్‌ఆర్ అకాడమీ నిర్వాహకులను వారు అభినందించారు. ఇలాగే బాసెట్‌బాల్ క్రీడలో ఆళ్లగడ్డకు ప్రత్యేక స్థానం తీసుకురావాలన్నారు.


బాస్కెట్ బాల్ ఆడుతున్న విద్యార్థులు

ఆటో వర్కర్స్ యూనియన్ మండలాధ్యక్షుడు మృతి

- సిపిఎంకు, యూనియన్ తీరని లోటు : నాయకులు

ప్రజాశక్తి - బేతంచెర్ల

సిపిఎం బేతంచెర్ల నాయకుడు, ఆటో వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు గుంతకల్ భాష అలియాస్ నూరుల్లా ఖాద్రీ (58) ఆదివారం మృతి చెందారు. గుంతకల్ బాషాకు మూడు నెలల క్రితం బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. చికిత్స పొంది కోలుకున్నాడు. శనివారం రాత్రి అకస్మాత్తుగా మృతి చెందారు. గుంతకల్ బాషకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. బేతంచెర్ల మండలంలో ఆటో వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షుడిగా గుంతకల్లు భాష ఆటో కార్మికులకు ఉపాధి చూపించి, సిఐటియు అభివృద్ధి కోసం ఎనలేని కృషి చేశారు. ఆయన మృతి చెందిన విషయం తెలిసిన సిపిఎం మండల కార్యదర్శి ఆర్ ఈశ్వరయ్య, సీనియర్ నాయకులు ఎస్.సాధిక్ హుస్సేన్, ఆటో వర్కర్స్ యూనియన్ మండల కార్యదర్శి మద్దిలేటి స్వామిలు గుంతకల్ బాషా భౌతికకాయాన్ని సందర్శించి నివాళ్లులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ గుంతకల్ బాషా మృతి సిపిఎంకి తీరని లోటన్నారు. బేతంచెర్ల ఆటో వర్కర్స్ యూనియన్‌కు అండగా నిలిచిన గుంతకల్లు బాషను కోల్పోవడం ఎన్నటికీ మర్చిపోలేమన్నారు. అనంతరం అంత్యక్రియల కార్యక్రమంలో ఆటో కార్మికులు పుల్లయ్య, అంజి, మద్దిలేటి స్వామి, మద్దయ్య, రాజు, శంకర్, మహేష్, భాష, మహమ్మద్ భాష, ఖాజా హుస్సేన్, అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.



నివాళ్లులర్పిస్తున్న నాయకులు

మంత్రి బుగ్గన గౌరవప్రద భాష మాట్లాడాలి

- టిడిపి డోన్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ధర్మవరం సుబ్బారెడ్డి

ప్రజాశక్తి - బేతంచెర్ల

రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి సమావేశాల్లో, బహిరంగ సభల్లో ప్రతిపక్ష పార్టీ నాయకులపైన అవమానకరంగా, వ్యంగంగా మాట్లాడే విధానాన్ని మార్చుకొని గౌరవప్రదమైన భాషను మాట్లాడితే అందరికీ మంచిదని, లేనిపక్షంలో తాను మాట్లాడడం మొదలు పెడితే పరిస్థితి వేరే ఉంటుందని టిడిపి డోన్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మవరం సుబ్బారెడ్డి హితవు పలికారు. ఆదివారం బేతంచర్లలోని టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ధర్మవరం సుబ్బారెడ్డి మాట్లాడారు. శనివారం బేతంచెర్ల పట్టణంలోని ఉర్దూ స్కూల్ ఓపెనింగ్ బహిరంగ సభలో ఆర్థిక మంత్రి బుగ్గన ఇష్టం వచ్చినట్లు జ్ఞానం లేదు, బుద్ధి లేదు అని టిడిపి నాయకులను మాట్లాడం సరైంది కాదన్నారు. 'డోన్ నియోజకవర్గ కేంద్రంలో రైల్వే అండర్ బ్రిడ్జి శాంక్షన్ అయిందని, శిలాఫలకాన్ని ప్రారంభించిన నీవు ఆ బ్రిడ్జి నిర్మాణానికి అనుమతి లెటర్ లేకుండానే ఎలా శిలాఫలకాన్ని ప్రారంభిస్తావు' అని ప్రశ్నించారు. అంతేకాకుండా డోన్-కర్నూలు రోడ్డులోని ఉడుగులపాడు దగ్గర టిటిడి కళ్యాణ మండపం నిర్మాణానికి భూమి పూజ చేసి ఇప్పటికి ఆరు నెలలు పూర్తయినా ఇంతవరకు పని మొదలు పెట్టకపోవడం ఆ వర్గ ప్రజలను మోసం చేయడం కాదా అని ప్రశ్నించారు. అధికార పార్టీ కదా అని అర్థంలేని అవమానకరమైన వ్యంగ్యాస్త్రాలతో మాట్లాడం మానుకోవాలని, మంచిగా మాట్లాడితే అందరికీ బాగుంటుందని అన్నారు. ఇలానే ప్రజలను మభ్యపెట్టి పబ్బం గడుపుకుంటూ, ఇష్టానుసారంగా మాట్లాడితే ప్రజలే తగిన గుణపాఠం చెప్తారని హెచ్చరించారు. సమావేశంలో మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ మురళి కృష్ణ గౌడ్, బేతంచర్ల పట్టణ కార్యదర్శి షేక్షావల్లి చౌదరి, చంద్రశేఖర్ చౌదరి, మస్తాన్ వలి, ఎస్సీ సెల్ నంద్యాల పార్లమెంట్ అధికార ప్రతినిధి రూబెన్, క్రిస్టియన్ రాష్ట్ర నాయకుడు మేకల నాగరాజు, ముళ్ళ, కౌన్సిలర్ రాంగోపాల్, డోన్ నియోజకవర్గం బీసీ సెల్ అధ్యక్షుడు ఎర్రమల నాయుడు, ఎస్సీ సెల్ మండల ఉపాధ్యక్షుడు ఎం సుమంత్, కానాల అంజి, రామ్మూర్తి, నంద్యాల మధు, వెంకటేశ్వర గౌడ్, కొలువలపల్లి నాగరాజు బుగ్గాన పల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు


రొట్టె పప్పు గుడ్డు పంపిణి చేస్తున్న ప్రార్థన సమయం నిర్వాహకులు జాన ప్రభాకర్

రొట్టె, పప్పు, గుడ్డు ఆరోగ్యానికి మంచి ఆహారం

ప్రజాశక్తి - డోన్

రొట్టె, పప్పు, గుడ్డు ఆరోగ్యానికి ఎంతో మంచి ఆహారమని ప్రార్థన సమయం నిర్వాహకులు జాన ప్రభాకర్ పేర్కొన్నారు. ఆదివారం డోన్ గవర్నమెంట్ హాస్పిటల్ నందు ప్రార్థన సమయం నిర్వాహకులు జాన ప్రభాకర్ ఆధ్వర్యంలో రొట్టె పప్పు గుడ్డు గర్భవతులకు, బాలింతలకు, రోగులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగులకు గర్భిణులు, బాలింతలు జొన్న రొట్టె తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉంటారన్నారు. ప్రతి ఆదివారం నిర్వహించే కార్యక్రమానికి దాతలు సహాయ సహకారాలు అందిస్తున్నారని తెలిపారు .పెళ్లిరోజు, పుట్టినరోజు, పెద్దల వర్ధంతి సందర్భంగా ఏదైనా పేదలకు ఉపయోగపడే ఈ కార్యక్రమానికి చేయూతనందించాలని కోరారు. కార్యక్రమంలో ఫక్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఎంపిటిసి మృతి

ప్రజాశక్తి - సంజామల

మండలంలోని కానాల గ్రామానికి చెందిన ఎంపీటీసీ వీరశేఖర్ రెడ్డి (48) అనారోగ్యంతో శనివారం రాత్రి మృతి చెందారు. విషయం తెలిసిన బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, టిడిసిసి బ్యాంకు డైరెక్టర్ గుండం సూర్యప్రకాశ్ రెడ్డి, మండలంలోని పలువురు నాయకులు ఆదివారం కానాల గ్రామానికి చేరుకుని వీరశేఖర్ రెడ్డి మృతదేహంపై పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వీరశేఖర్ రెడ్డి కుటుంబానికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు.

సచివాలయ ఉద్యోగులను

బిఎల్‌ఒ విధుల నుండి తప్పించాలి

- ఎపి గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సమాఖ్య

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ వార్డు సచివాలయంలో విధులు నిర్వహిస్తూ పని భారం ఎక్కువగా ఉన్న సెక్రటరీలను బిఎల్‌ఒ (బూత్ లెవల్ ఆఫీసర్) విధుల నుండి వెంటనే తప్పించాలని గ్రామ వార్డు సచివాల ఉద్యోగుల సంక్షేమ సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.గురుస్వామి, జిల్లా అధ్యక్షుడు డి.వి.రామకృష్ణ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం వారు మీడియాతో మాట్లాడుతూ గ్రామ వార్డు సచివాలయాలలో విధులు నిర్వహిస్తున్న సెక్రటరీలకు ముందే పని భారం ఎక్కువై చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అయినప్పటికీ వారికే మళ్లీ బిఎల్‌ఒ విధులు అప్పగించడం వల్ల పని ఒత్తిడి మరింత పెరిగి చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. చివరకు ఆత్మహత్యలు కూడా చేసుకుంటున్నారని తెలిపారు. మరోపక్క బిఎల్‌ఒ విధులు సక్రమంగా నిర్వహించడం లేదని రాష్ట్ర వ్యాప్తంగా మెమోలు ఇస్తూ, సస్పెన్షన్లు చేస్తున్నారని, నిన్న అనంతపురం జిల్లా వజ్రకరూరు మండలంలో ఇలాంటి సంఘటన చోటుచేసుకోవడం వల్ల పశుసంవర్ధక సహాయకుడు అనిల్ కుమార్ ఆత్మహత్యాయత్నం చేసుకోవడం బాధాకరమని అన్నారు. వెంటనే ఆయన కోలుకునేలా ప్రభుత్వమే చొరవ చూపి మెరుగైన చికిత్స అందించాలని, ఇలాంటి సంఘటనలు మళ్ళీ పునరావృతం కాకుండా సెక్రటరీలను బిఎల్‌ఒ విధుల నుండి తప్పించాలని కోరారు. గతంలో గ్రామ వార్డు సచివాలయ ఉన్నతాధికారులు సంక్షేమ కార్యదర్శులకు బిఎల్‌ఒ విధుల నుండి తప్పించాలని ఉత్తర్వులు ఇచ్చినప్పటికీ వారిని ఇంతవరకు తప్పించకుండా ఎందుకు చేయడం లేదో అర్థం కావడంలేదని, ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బిఎల్‌ఒ విధుల నుండి తప్పించాలని రాష్ట్ర ప్రభుత్వఉన్నతాధికారులకు, ఎన్నికల సంఘానికి విన్నవించు కుంటున్నామని తెలిపారు.

నేడు స్పందన కార్యక్రమం రద్దు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్ : ఈనెల 15వ తేదీ స్వాతంత్ర దినోత్సవ వేడుకల సందర్భాన్ని పురస్కరించుకొని నేడు జగనన్నకు చెబుదాం-స్పందన కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వ్యయ ప్రయాసలకోర్చి ఎవరు జిల్లా కేంద్రానికి రావద్దని విజ్ఞప్తి చేశారు. అయితే మండల, నియోజకవర్గ, డివిజన్ స్థాయిలో స్పందన కార్యక్రమం యధావిధిగా జరుగుతుందని పేర్కొన్నారు.

శిల్పా నేచర్ హోమ్స్‌లో హ్యాపీ సండే కార్యక్రమాలు

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ : పట్టణంలోని శిల్పా నేచర్ హెూమ్స్‌లో ఆదివారం జోష్ ఆళ్లగడ్డ.. హ్యాపీ సండే కార్యక్రమాలలో ప్రజలు ఆనందంగా గడిపారు. జుంబాడాన్స్, ఏరోబిక్ ఎక్సర్సైజెస్, యోగా ప్రదర్శనలతో రెండు గంటల పాటు ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. ఆళ్లగడ్డ ఏపీ ట్రాన్స్కో ఏడీఈ రవికాంత్ చౌదరి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. నేడు ప్రతి ఒక్కరూ బిజీ లైఫ్‌ను గడుపుతూ ఆటపాటలకు దూరంగా ఉంటున్నారన్నారు. రోటరీ ఆరోగ్య వేదిక వ్యవస్థాపకులు డాక్టర్ రామ్ గోపాల్ రెడ్డి గత కొద్ది నెలలుగా ప్రతి ఆదివారం హ్యాపీ సండే కార్యక్రమాలు నిర్వహిస్తూ కేవలం నగరాలలో ఉండే సంస్కృతిని ఆళ్లగడ్డకు తీసుకొచ్చారని ప్రశంసించారు. ప్రస్తుత వర్షాకాలంలో విద్యుత్ స్తంభాలు ట్రాన్సార్మర్లను ఎవరు ముట్టుకోరాదని, ఏదైనా సమస్య ఉంటే విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకొని రావాలని, విద్యుత్ పొదుపు పాటించాలని, విద్యుత్ వినియోగదారులు బిల్లులు సకాలంలో చెల్లించాలని సూచించారు.

ఎన్‌సిసి క్యాడెట్ల యోగ ప్రదర్శన : స్థానిక ప్రజ్ఞా డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్‌సిసి క్యాడెట్లు దినేష్, శ్రవణ్ కుమార్, హుస్సేన్ భాషలు సభ్యులకు యోగాలో మెలకువలు నేర్పించారు. ప్రముఖ వైద్యుడు డాక్టర్ ఏవి రామసుబ్రహ్మణ్యం ఏరోబిక్స్, డాన్స్ ప్రాక్టీస్ చేయించారు. శ్రీలక్ష్మి జుంబా డాన్స్ ప్రదర్శనలో పాల్గొన్నారు. డాక్టర్ ప్రసాద్ మెదడు, నాలుక, గుండె ఆరోగ్యంపై తీసుకోవాల్సిన మెలకువలు వివరించారు. అనంతరం ముఖ్య అతిథి ఏడిఈ రవికాంత్ చౌదరిని రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ పేరూరు విజయ్ కుమార్, సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో టౌన్ ఎస్ఐ వెంకటరెడ్డి, ప్రముఖ న్యాయవాదులు రమాదేవి, వెంకట సుబ్బారెడ్డి, కెవిఎస్ఆర్ విద్యా సంస్థల డైరెక్టర్ మల్లేశ్వర్ రెడ్డి,హెచ్ఎం రామచంద్రారెడ్డి, రోటరీ క్లబ్ పాస్ట్ ప్రెసిడెంట్ దేవిశెట్టి హరీష్ బాబు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ముగిసిన జాతీయ స్థాయి అండర్ గ్రాడ్యుయేట్ ఫెస్ట్

ప్రజాశక్తి - నంద్యాల

నంద్యాల పట్టణంలోని శ్రీ రామకృష్ణ డిగ్రీ, పిజి కళాశాలలో జాతీయ స్థాయి అండర్ గ్రాడ్యుయేట్ ఫెస్ట్ ఆదివారం ముగింది. డిగ్రీ విద్యార్థుల సదస్సు ముగింపు సభకు ముఖ్య అతిథిగా నంది పైప్స్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ మేనేజింగ్ డైరెక్టర్ సుజలా రెడ్డి హాజరై మాట్లాడారు. యువత దేశ ప్రగతికి చాలా అవసరమన్నారు. అందుకే యువతను కలిసే అవకాశం తనకి లభించిందన్నారు. యువత పారిశ్రామికంగా ఎదగాలని, ఇలాంటి ఫెస్ట్ లలో పాల్గొనడం వల్ల వారి ఆలోచన ధోరణి మారుతుందన్నారు. విజ్ఞాన నైపుణ్యాలు అభివృద్ధి చేసుకుంటారని తెలిపారు. తమ సంస్థలో చాలా మందికి ప్రతి సంవత్సరం ప్రాజెక్ట్‌లకి అంగీకరిస్తున్నమని చెప్పారు. ఇలాంటి ఎంతో మంచి ఫెస్ట్‌లను నిర్వహిస్తున్న విద్యార్థులను, వారిని ప్రోత్సహిస్తున్న యాజమాన్యానికి ప్రశంసించారు. కళాశాల చైర్మన్ ప్రొఫెసర్ జి.రామకృష్ణ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఎంతో సృజాత్మకంగా, ఇన్నోవేటివ్‌గా ఈవెంట్ నిర్వహించారని, ఇలాగే ముందు కూడా ఉండాలని యువతలో స్ఫూర్తి నింపారు. జాతీయ స్థాయి ఫెస్ట్‌కి స్పాన్సర్స్‌గా సహకారం అందించిన చందన బ్రదర్స్, శ్రీ గురు రాఘవేంద్ర బ్యాంకింగ్ కోచింగ్ సెంటర్, టీవీఎస్ శ్రీ సాయి షోరూమ్, లిద్దార్థ్ పీవీసీ పైప్స్ అండ్ ఫిట్టింగ్స్, గెలివి మల్టీస్పెషాలిటీ హాస్పిటల్, ఇండెస్ హార్ట్ ఇనిస్టిట్యూట్, రాయలసీమ ఆర్థోహాస్పిటల్, ఎస్‌డిఆర్ వరల్డ్ స్కూల్, కెల్విన్ స్కేల్, శ్రీ కృష్ణా బైక్ యమహా షోరూమ్, అమరేశ్వర ఏజెన్సీస్, అబ్దుల్లా కలాం జ్యువెల్లర్స్, అన్సార్ జ్యువెల్లర్స్, భవనాసి జ్యువెల్లర్స్, ఓటీపీ అకడేమిక్స్ , సంజీవ నేత్రాలయం, ఎంఎం రెంటల్ కెమెరాలు, పెయిడ్ ఫోటోషూట్, దుర్గా కంప్యూటర్, శ్రీ రామకృష్ణ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘంలో అక్కడకు విచ్చేసిన వారు మాట్లాడారు. అనతరం ముఖ్య అతిథులు విద్యా సంస్థల చైర్మన్, డైరక్టర్ డాక్టర్ జి. హేమంత్ రెడ్డి, సెక్రెటరీ విజయ కుమారి, ఎస్టేట్ మేనేజర్ ఏఎస్.ప్రగతి రెడ్డి పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ప్రతీకలతో పాటు రూ. 15 వేలు దాకా నగదు బహుమతి, సర్టిఫికెట్ అందజేశారు. ఈ ఫెస్ట్‌కి కన్వీనర్లుగా విధులు నిర్వర్తించిన ఎం.ఇంతియాజ్ అహ్మద్, ఎం.శ్రావణి కుమారిలను సత్కరించారు.


విజేతలకు బహుమతులు అందచేస్తున్న సుజాల రెడ్డి

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - వెలుగోడు

వెలుగోడు పట్టణంలోని గుండ్ల బ్రహ్మేశ్వరం (జిబిఎం) పాఠశాలలో 1999-2000 సంవత్సరం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం పూర్వ విద్యార్థులైన ఉదారు చక్రధర్ రెడ్డి, అంబటి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. తమ ఉపాధ్యాయులు ఎం.చంద్రశేఖర్ రెడ్డి, జి.నాగిరెడ్డి, సుబ్బయ్యలను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించి మెమెంటోలను అందజేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు పొలగారి నిరంజన్ రెడ్డి, చంద్రమౌళి మాట్లాడుతూ తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను మరువరాదని అన్నారు. స్నేహితులను అందరిని ఒక చోట చేర్చే పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనానికి కృషి చేసిన ప్రతి ఒక్క మిత్రునికి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మోహన్ రెడ్డి, కిరణ్, మురళి లతో పాటు పూర్వ విద్యార్థులు హరిత, వసంత, అనిత, వేల్పనూరు రెడ్డి గారి పరమేశ్వర్ రెడ్డి, బోయ రేవుల జనార్దన్, సురేష్, కిరణ్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


గురువులతో పూర్వ విద్యార్థులు

యోగాతో మానసిక ఆరోగ్యం

- యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ చైర్మన్ ఆవుల విజయభాస్కర్ రెడ్డి

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

మానసిక ఆరోగ్యానికి, ఆధ్యాత్మిక సాధనకు యోగా చక్కని పరిష్కార మార్గమని నంద్యాల జిల్లా యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ చైర్మన్ ఆవుల విజయభాస్కర్ రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి ఆవరణలో రెండవ జిల్లా స్థాయి యోగాసన ఎంపిక పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు పిల్లలు మొదలు పెద్దల వరకు యోగాకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. దైనందిక జీవితంలో విద్యార్థులు యోగాను అంతర్భాగం చేసుకున్నప్పుడే శారీరక అభివృద్ధితో పాటు మానసికంగా ఎదుగుదల ఉంటుందన్నారు. అనంతరం రాష్ట్ర యోగ సంఘం ప్రధాన కార్యదర్శి యోగాచార్య అవినాష్ శెట్టి మాట్లాడుతూ జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభను కనబరిచిన క్రీడాకారులు సెప్టెంబర్ 9వ తేదీ నుంచి 10వ తేదీ వరకు కర్నూల్లో జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు బాలకృష్ణ, హనుమంత రెడ్డి మాట్లాడుతూ నంద్యాల జిల్లా వ్యాప్తంగా సుమారు 200 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొనడం విశేషమన్నారు. అంతకుముందు చిన్నారులు ప్రదర్శించిన ఆర్టిస్ట్ యోగ విన్యాసాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో నంద్యాల జిల్లా వ్యాయామ అధ్యాపకుల సంఘం అధ్యక్షులు నాగేంద్ర, రాష్ట్ర జంప్ రోప్ సంఘం కార్యదర్శి సుబ్బయ్య, వ్యాయామ అధ్యాపకులు శ్రీధర్, శ్రీనివాసరెడ్డి, దేవేంద్ర, ప్రతాప్, మౌలాలి, శ్రీలత, దాదాపీర్‌లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న విజయ భాస్కర్ రెడ్డి


రూ. 50 వేలు ఆర్థికసాయం అందజేస్తున్న దృశ్యం

వీర జవాన్ కుటుంబానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి - పాములపాడు

ఉగ్రవాద దాడిలో అమరుడైన పాములపాడు మండలం కృష్ణానగర్ గ్రామానికి చెందిన వీర జవాన్ సిరిగిరి సురేంద్ర కుటుంబ సభ్యులకు నంద్యాల డాక్టర్ల మిత్ర బృందం ఆర్మీ మేజర్ డాక్టర్ సంతోష్ కుమార్, డాక్టర్ నెట్ల మహేశ్వర్ రెడ్డి, డాక్టర్ విజయబాబులు రూ. 50 వేలు చెక్కును ఆదివారం అందజేశారు. వీర జవాన్ సురేంద్ర చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. వారు మాట్లాడుతూ ఆజాదికా అమృత మహెూత్సవం స్వాతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని అమరుడైన సురేంద్ర కుటుంబాన్ని పరామర్శించినట్లు తెలిపారు. దేశ సేవలో అమరులైన వారిని ఎంత కొనియాడినా తక్కువే అన్నారు. భవిష్యత్తులో ఈ కుటుంబానికి ఉచితంగా వైద్య సేవలు అందిస్తామన్నారు.

ప్రజా గాయకుడు గద్దర్‌కు నివాళి

ప్రజాశక్తి - నంద్యాల

నంద్యాల పట్టణంలోని ఏపీటీఎఫ్ కార్యాలయంలో ప్రజా యుద్ధనౌక, విప్లవ గాయకుడు గద్దర్ చిత్రపటానికి సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు పూలమాల వేసి ఆదివారం ఘనంగా నివాళులర్పించారు. డివిజన్ కార్యదర్శి ఎం.శంకర్ మాట్లాడుతూ ప్రజా గాయకుడు విప్లవ సాంస్కృతిక కళాకారుడు గద్దర్ మరణం సాంస్కృతిక రంగానికి కళా రంగానికి తీరనిలోటని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో పిడిఎస్యు ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎస్ఎండి రఫీ, ఐఎఫ్‌టియు జిల్లా కోశాధికారి ఎస్ చౌడప్ప, అధ్యక్షులు మహమ్మద్, ఆదర్శ భవన నిర్మాణ కార్మిక సంఘం డివిజన్ నాయకులు కాజామియా, రఫీ, సామెల్ తదితరులు పాల్గొన్నారు.



గద్దర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న దృశ్యం

టిడిపితోనే మహిళల అభివృద్ధి : గౌరు చరిత

ప్రజాశక్తి - పాణ్యం

తెలుగుదేశం పార్టీతోనే మహిళలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా అభివృద్ధి చెందుతారని పాణ్యం మాజీ ఎమ్మెల్యే, టిడిపి ఇన్‌చార్జి గౌరు చరిత రెడ్డి అన్నారు. మహాశక్తి చైతన్య యాత్ర, భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా ఆదివారం పాణ్యం మండలం భూపనపాడు గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ఆమె టిడిపి ప్రవేశ పెట్టిన మినీ మేనిఫెస్టో, సూపర్ సిక్స్ పథకాలను ప్రకటించడంతో ఇంటింటికీ తిరిగి కరపత్రాలను అందజేస్తూ మహిళలకు వివరించారు. అనంతరం భూపన పాడు గ్రామం బిసి కాలనీ మహిళలు మాట్లాడుతూ ప్రధానంగా రోడ్లు, డ్రైనేజీ సమస్యలతో రోడ్లపై నడవలేక ఇబ్బంది పడుతున్నామని గౌరు చరితకు విన్నవించారు. ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి 4 సంవత్సారాలయినా తమ ఊరికి ఎలాంటి అభివృద్ధి చేయలేదన్నారు. అనంతరం గౌరు చరిత మాట్లాడుతూ మళ్ళీ తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం వస్తేనే సమస్యలన్నీ పరిష్కారం అవుతాయని తెలిపారు. ఆంధ్ర ప్రదేశ్‌కి అభివృద్ధి దాత చంద్రబాబు నాయుడు అన్నారు. 2024 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ సైకిల్ గుర్తుకు ఓటు వేసి చంద్ర బాబు నాయుడును ముఖ్యమంత్రి చేసుకోవాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో టిడిపి పాణ్యం మండల ముఖ్య నాయకులు, కార్యకర్తలు, భూపనపాడు గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు. **ఆత్మకూరు :** తెలుగుదేశం పార్టీ పాలనలోనే మహిళలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా అభివృద్ధి చెందారని తెలుగు మహిళా నాయకురాలు గంగాదేవి అన్నారు. ఆదివారం మండలంలోని కృష్ణాపురం గ్రామంలో మహాశక్తి కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సభలో ఆమె మాట్లాడారు. టిడిపి మహానాడులో మొట్టమొదటగా మహిళల అభివృద్ధి కోసం మినీ మేనిఫెస్టోను విడుదల చేసిందన్నారు. నాడు తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు ఎన్టీ రామారావు స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలకు రిజర్వేషన్, ఆస్తి హక్కు లాంటి పథకాలను ఆయన ప్రవేశపెట్టగా నేడు మహాశక్తి పేరుతో తల్లికి వందనం కింద ప్రతి ఇంటిలో ఉన్న మహిళలకు విద్యాభివృద్ధి కోసం ఒక్కొక్కరికి సంవత్సరానికి 15 వేల రూపాయలు, ఆడబిడ్డ నిధి కింద ప్రతి స్త్రీకి నెలకు 1500, దీపం పేరుతో ప్రతి ఇంటికి ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇవ్వనున్నట్లు తెలిపారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం లాంటి పథకాలను ప్రవేశపెట్టారని చెప్పారు. మహిళలు ఈ విషయాన్ని గమనించి రాబోవు ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ, మండల స్థాయి మహిళా నాయకురాలు, మహిళలు పాల్గొన్నారు.


టిడిపి మినీ మేనిఫెస్టో కరపత్రాలను అందజేస్తున్న గౌరు చరిత


మాట్లాడుతున్న టిడిపి మహిళా నాయకురాలు గంగాదేవి